



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు







సంపుటి : 1 సంచిక : 93 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : శ్రీకాకుళం గురువారం 16 ఏప్రిల్ 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 93 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : SRIKAKULAM THU 16 APRIL 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, Chittor, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur



# మత్స్యకారులకు సీఎం చంద్రబాబు ద్రోహం

- కళ్లు మూసి తెరిచేలోగా మళ్లీ మన ప్రభుత్వమన్న జగన్
- కూటమి పాలనలో మత్స్యకారుల పొట్ట కొడుతున్నారని విమర్శ
- జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమేసే కుట్ర జరుగుతోందని ఆరోపణ
- తమ హయాంలో రూ.26 వేల కోట్లతో పోర్టులు, హార్బర్లు నిర్మించామని వెల్లడి
- అధికారంలోకి రాగానే మత్స్యకారుల హక్కులు కాపాడతామని హామీ



పెన్ పవర్ డెస్క్:మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధినేత జగన్ ఏపీలోని కూటమి ప్రభుత్వంపై, సీఎం చంద్రబాబుపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో ప్రస్తుతం పాలన అన్యాయంగా సాగుతోందని, దేవుడు అన్నీ చూస్తున్నాడని వ్యాఖ్యానించారు. కళ్లు మూసుకుని తెరిచేలోపు మళ్లీ మన ప్రభుత్వం వస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.నెల్లూరు జిల్లా పర్యటనలో భాగం గా ఆయన జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను పరిశీలిం చారు. ఈ సందర్భంగా స్థానిక మత్స్యకారులతో ముఖాముఖి నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ప్రభుత్వ హయాంలో మత్స్యకారుల సంక్షేమానికి పెద్దపీట వేశామని జగన్ గుర్తుచేశారు. రాష్ట్రంలో రూ.26 వేల కోట్లతో నాలుగు కొత్త పోర్టులు, 10 ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ సెంటర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. మచిలీపట్నం, మూలపేట పోర్టుల పనులు 35 శాతం పూర్తి చేశామని, రామాయపట్నం పోర్టు పనులు దాదాపు పూర్తయ్యాయని వివరించారు. 2024 మార్చి 12న తాము జువ్వలదిన్నె హార్బర్‌ను వర్చువల్‌గా ప్రారంభించామని, కానీ నేటికీ దానిని మత్స్యకారులకు ఎందుకు అప్పగించలేదని కూటమి ప్రభుత్వాన్ని జగన్

మిగతా 2లో



## ఇరాన్‌కు ఇక ఆయుధాలు పంపబోమని చైనా చెప్పింది

- తమ మాట విని చైనా వెనక్కి తగ్గిందన్న ట్రంప్
- హార్మూజ్ ను ఇక మూసి ఉంచడం జరగదని ఉద్ఘాటన
- హార్మూజ్ ను తెరిచే ప్రయత్నాలపై చైనా సంతోషంగా ఉందని వెల్లడి
- చర్చలు యుద్ధం కన్నా మంచివని వ్యాఖ్యలు

పెన్ పవర్ డెస్క్:ఇకపై ఇరాన్‌కు ఎలాంటి ఆయుధాలు పంపబో మని చైనా అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం కీలక ప్రకటన

మిగతా 2లో



## క్రీడా దిగ్గజాలతో నారా లోకేశ్ ముఖాముఖి...

### సూచనలు, సలహాలు స్వీకరణ

- ఏపీలో క్రీడాభివృద్ధికి పలు సూచనలు, సలహాలు
- పాఠశాల స్థాయి నుంచే శిక్షణ ఇవ్వాలన్న పీవీ సింధు
- వేసవి శిక్షణా శిబిరాలు నిర్వహించాలని మిథాలీ రాజ్ సూచన
- క్రీడాకారులకు ప్రత్యేక కరిక్యులమ్ పరిశీలించాలన్న మల్లేశ్వరిం

పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకొచ్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. ఇందులో భాగంగా, రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తిరుపతిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులతో ముఖాముఖి నిర్వహించారు. రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై వారి నుంచి విలువైన సూచనలు, సలహాలు స్వీకరించారు. కూటమి ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి కృషి చేస్తోందని, మంత్రి లోకేష్ అండగా నిలుస్తున్నారని క్రీడాకారులు ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రముఖ

మిగతా 2లో



## ఈ 9 పనులు చేస్తామని మాటివ్వండి

పెన్ పవర్ డెస్క్:ప్రధాని నరేంద్ర మోదీ కర్ణాటకలోని ఆదిచుం చనగిరి మఠాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 9 పనుల గురించి మోదీ హామీ తీసుకున్నారు. "మీ నుంచి నాకు తొమ్మిది హామీలు కావాలి. వికసిత్ కర్ణాటక కో సం మీరంతా నాకు వాటిపై ప్రమాణం చేయండి.

మిగతా 2లో

## డీలిమిటేషన్ ఏపీ ప్రయోజనాలను దెబ్బతీస్తుంది

### చంద్రబాబుకు షర్మిల బహిరంగ లేఖ

- ఏపీ తన రాజకీయ ప్రభావాన్ని కోల్పోతుందన్న షర్మిల
- డీలిమిటేషన్ ను చంద్రబాబు వ్యతిరేకించాలని విన్నపం
- దీనిపై చర్చించేందుకు ఒకరోజు ప్రత్యేక అసెంబ్లీ సమావేశాన్ని ఏర్పలుడు చేయాలని సూచన

మిగతా 2లో



## పల్లె ప్రజల కోసం 62 అన్న క్యాంటీన్ల ప్రారంభం...


### పేదల కడుపు నిండినప్పుడే నిజమైన అభివృద్ధి అన్న చంద్రబాబు

- పల్నాడు జిల్లా ధరణికోటలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభించిన సీఎం చంద్రబాబు
- రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా 62 గ్రామీణ ప్రాంతాల్లో క్యాంటీన్ల ఏర్పాటు
- పేదల ఆకలి తీరినప్పుడే అది నిజమైన అభివృద్ధి అని వ్యాఖ్య
- గత ప్రభుత్వం అన్నదానాన్ని అడ్డుకుందని తీవ్ర విమర్శలు
- రాష్ట్రంలో 269కి చేరిన అన్న క్యాంటీన్ల మొత్తం సంఖ్య



పెన్ పవర్ డెస్క్:పేదల కడుపు నిండినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని, ఎంత అభివృద్ధి సాధించినా పేదలకు పట్టెడన్నం లేకపోతే అది వృథా అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అన్నార్తుల ఆకలి తీర్చడమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. బుధవారం పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని ధరణికోటలో

మిగతా 2లో



## రామాలయ నిర్మాణానికి కోటి రూపాయల విరాళాలు

### ఆకివీడు ఆలయంపై రఘురామకృష్ణరాజు వ్యాఖ్యలు

- అన్ని రకాల అనుమతులతో ఆకివీడు రామాలయాన్ని వైభవంగా నిర్మిస్తామన్న రఘురామ
- ఇక్కడ పురాతన రామాలయం ఉందనే విషయం తనకు సాక్షి ద్వారానే తెలిసిందని వెల్లడి
- కల్వరి టెంపుల్ వంటి వారు ప్రార్థనా మందిరాలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నారని ఆరోపణ

మిగతా 2లో

## సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు.. ఐదుగురి మృతి...

### 12 మంది పరిస్థితి విషమం

- సత్యసాయి జిల్లా కదిరిలో భారీ పేలుడు
- డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఘటన
- ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి
- 20 మందికి తీవ్ర గాయాలు
- క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి సత్యకుమార్ ఆదేశం



పెన్ పవర్ డెస్క్:శ్రీ సత్యసాయి జిల్లాలో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. కదిరి మండలంలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన డిటోనేటర్లు, గ్యాస్ సిలిండర్లు పేలడంతో ఐదుగురు

మిగతా 2లో

## దొంగల్లా ఎత్తుకెళ్లడం దేనికి?

### పూడి శ్రీహరి అరెస్టుపై పేర్ని నాని నిప్పులు

- పోలీసు వ్యవస్థ దిగజారడం శోచనీయమన్న పేర్ని నాని
- జగన్ చుట్టూ ఉన్నవారిపై తప్పుడు కేసులు బనాయిస్తున్నారని మండిపాటు
- పర్యవసనాలను చంద్రబాబు అనుభవించక తప్పదని హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్:వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూడి శ్రీహరి అరెస్టుపై మాజీ మంత్రి పేర్ని నాని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. టీడీపీ నేతల కళ్లలో ఆనందం కోసం పోలీసు వ్యవస్థను ఇంతలా దిగజార్చడం శోచనీ యమని మండిపడ్డారు. పూడి శ్రీహరి ఏమైనా నేరాలు చేశారా? అని ప్రశ్నించిన నాని, చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాలనుకుంటే బహిరంగంగా అరెస్ట్ చేయాలి కానీ, దొంగతనంగా ఎత్తుకెళ్లడం ఏంటని నిలదీశారు. విలేకరి స్థాయి నుంచి

మిగతా 2లో

## మళ్లీ తోక జాడిస్తున్న పాక్...

### భారత్‌లో చొరబడేందుకు 800 మంది టెర్రరిస్టులు సిద్ధం!

- భారత్‌లోకి 800 మంది ఉగ్రవాదులను పంపేందుకు పాక్ భారీ కుట్ర
- సరిహద్దుల్లో 70 ఉగ్రవాద లాంచ్‌ప్యాడ్‌ల పునరుద్ధరణ
- భారత్‌లో ఎన్నికలు, మధ్యప్రాచ్య సంక్షోభమే పాక్‌కు అదును
- కొత్త వ్యూహంతో ఒకేసారి పలుచోట్ల నుంచి చొరబాట్లకు ప్లాన్

పెన్ పవర్ డెస్క్:జమ్మూ కశ్మీర్‌లో మరోసారి అలజడి సృష్టిం చేందుకు పాకిస్థాన్ భారీ కుట్రకు తెరలేపిం ది. సుమారు 800 మంది ఉగ్రవాదులను భారత్‌లోకి పంపేందుకు పాక్ నిఘా సంస్థ ఐఎస్ఐ, ఆ దేశ సైన్యం ప్రణాళికలు రచి స్తున్నట్లు భారత నిఘా వర్గాలు బుధవారం హెచ్చరించాయి. దీని కోసం నియంత్రణ రేఖ (ఎల్‌ఓసీ), అంతర్జాతీ య సరిహద్దు వెంబడి సుమారు 70 ఉగ్రవాద లాంచ్‌ప్యా డ్‌లను

మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# మహిళా రిజర్వేషన్లు..

# రాజకీయ లబ్ధి కోసం బిజెపి ఎత్తుగడ

మహిళలకు చట్టసభలలో మూడో వంతు స్థానాలను రిజ్వర్వు చేయటం కోసం ఆమోదించిన చట్టం తక్షణ అమలుకు అవసరమైన సవరణల కోసం ప్రధాని నరేంద్ర మోడీ హడావిడి చేస్తున్నారు. ఈ నెల 16-18 తేదీలలో పార్లమెంటు సమావేశాలను ఏర్పాటు చేస్తున్నామని, ఈ చట్ట సవరణలను ఆమోదించటానికి సహకరించాలని ఆయన అన్ని రాజకీయ పార్టీలకు లేఖలు రాశారు. దేశంలోని ముఖ్యమైన ఐదు రాష్ట్రాల శాసనసభలకు ఎన్నికలు జరుగుతున్న వేళ, మహిళలను ప్రలోభ పెట్టి, రాజకీయ ప్రయోజనం పొందటం లక్ష్యంగా మోడీ ఈ చర్చను ముందుకు తీసుకొచ్చారు. ఎన్నికలు పూర్తయ్యే వరకు పార్లమెంటు సమావేశాలను వాయిదా వేయాలని, ఆ తర్వాత మొదట అఖిలపక్ష సమావేశం జరిపి అన్ని పార్టీల అభిప్రాయాలు తీసుకొని ముందుకు సాగాలని వివిధ రాజకీయ పార్టీలు చేస్తున్న విజ్ఞప్తులు ప్రభుత్వ చెవికెక్కటం లేదు. చట్టసభలలో మూడో వంతు స్థానాలను మహిళలకు రిజర్వేషన్ చేయాలన్న బిల్లును 2023 సెప్టెంబరులో పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించింది. నారీ శక్తి విధాన్ అధినియం బిల్లుకు పార్లమెటులో 454 మంది సభ్యులు అనుకూలంగా ఓటు వేయగా ఇద్దరు మాత్రమే వ్యతిరేకించారు. రాజ్యసభ ఏకగ్రీవంగా ఈ బిల్లును ఆమోదించటంతో చట్టంగా మారింది. ఈ చట్టం ప్రకారం లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలు, ఢిల్లీ శాసనసభలో 33 శాతం స్థానాలు మహిళలకు రిజర్వు చేయబడతాయి. రిజర్వేషన్లు 15 సంవత్సరాల పాటు అమలులో ఉంటాయని చట్టంలో పేర్కొన్నారు. ఈ చట్టాన్ని ఆమోదించిన తర్వాత సేకరించిన జనాభా లెక్కల ప్రాతిపదికగా లోక్‌సభ, శాసనసభల స్థానాలను పునర్వవస్థీకరణ చేసి, ఆ ప్రాతిపదికపై మహిళలకు రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రభుత్వం చెప్పింది.

2024 పార్లమెంటు, శాసనసభల ఎన్నికలలోనే ఈ చట్టాన్ని అమలు చేయాలని ప్రతిపక్షాలు పట్టుపట్టాయి. కాని జనాభా లెక్కలు, నియోజక వర్గాల పునర్వ్యవస్థీకరణ పేరుతో ప్రభుత్వం చట్టం అమలును వాయిదా వేసింది. అమలును వాయిదా వేసిన ప్రభుత్వమే ఇపుడు చట్టం అమలుకు అందరూ మద్దతివ్వాలని లేఖలు రాయటం హాస్యాస్పదంగా ఉన్నది. లేని నెపాన్ని ప్రతిపక్షాలపై మోపి, లబ్ధి పొందాలనే హ్రస్వదృష్టి మినహా, విశాల దృక్పథంతో ఆలోచించే పరిపక్వత మోడీకి లేదు.బెంగాల్ వామపక్ష ప్రభుత్వం మహిళలకు ×మొదట రిజర్వేషన్లు కల్పించింది. చట్టసభలలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాలన్న భావన బిజెపికి ఏ కోశానా లేదు. 1977లో పశ్చిమ బెంగాల్‌లో అధికారంలోకి వచ్చిన వామపక్ష ప్రభుత్వం మొదటగా పంచాయతీ, సమితి, జిల్లా పరిషత్‌లలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లను కల్పించింది. తర్వాత దానిని 50 శాతానికి పెంచింది. పశ్చిమ బెంగాల్‌ను స్ఫూర్తిగా తీసుకొని నాటి ప్రధాని రాజీవ్ గాంధి దేశ వ్యాపితంగా స్థానిక సంస్థలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు కోసం 73, 74 రాజ్యాంగ సవరణలు తీసుకొచ్చారు. రాజ్యాంగ సవరణల తర్వాత దేశమంతటా స్థానిక సంస్థలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు అమలు జరుగుతున్నాయి.

స్థానిక సంస్థలతో పాటు పార్లమెంటు, రాష్ట్రాల అసెంబ్లీలో కూడా మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కావాలనే డిమాండ్ ఊపందుకుంది. 1996లో దేవెగౌడ ప్రధానిగా ఉన్నపుడు మహిళా రిజర్వేషన్ బిల్లును మొదటగా పార్లమెంటులో ప్రవేశపెట్టారు. తర్వాత మరికొన్ని సార్లు కూడా లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టినప్పటికీ బిజెపితో పాటు సమాజ్‌వాది, ఆర్‌జెడి లాంటి ప్రతిపక్షాలు కూడా సహకరించక పోవటంతో ఆమోదం పొందలేదు. ప్రతిసారీ ప్రభుత్వం బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టటం, తర్వాత సభ వాయిదాలు పడి, సభ కాల పరిమితి ముగిసిపోవటంతో బిల్లు కూడా మురిగిపోయేది. 2002లో పార్లమెంటులో ఈ బిల్లును ప్రవేశపెట్టినపుడు పూర్తి మద్దతు ఇస్తామని కాంగ్రెస్, వామపక్షాలు వాజ్‌పేయి ప్రభుత్వానికి హామీ ఇచ్చాయి. కాని ప్రభుత్వం బిల్లును ఆమోదించటానికి చొరవ తీసుకోలేదు. 2003లో బిల్లును రెండుసార్లు తిరిగి ప్రవేశపెట్టిన తర్వాత ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం నిర్వహించి, బిల్లును ఆమోదిస్తామని చెప్పింది. కాని ఆ తర్వాత బిల్లును వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ మనోహర్ జోషి ప్రకటించారు. కాంగ్రెస్ బిల్లును అడ్డుకుంటున్నదని, 2004 ఎన్నికలలో పూర్తి మెజారిటీ సాధించిన తర్వాత బిల్లును ఆమోదిస్తామని ఎన్నికలకు కొద్ది రోజుల ముందు వాజ్‌పేయి ప్రకటించారు. కాని 2005లో పార్లమెంటులో తిరిగి బిల్లును ప్రవేశపెట్టగా, కుల ప్రాతిపదికపై బి.సి మహిళలకు కోటాలో ప్రత్యేక కోటా ఇవ్వాలని ఉమా భారతి, ఇతర బిజెపి నాయకులు డిమాండ్ చేసి బిల్లుకు ఆటంకం కల్పించారు. సమాజ్‌వాది, ఆర్‌జెడి తదితర పార్టీలు కూడా ఆటంకాలు కల్పించినప్పటికీ, బిజెపి పూర్తి మద్దతిచ్చి, నిజాయితీగా వ్యవహరించినట్లైతే మహిళా రిజర్వేషన్ బిల్లు ఎప్పుడో ఆమోదం పొందేది.

యుపిఎ ప్రభుత్వం 2008లో ఈ బిల్లును మొదట రాజ్యసభలో ప్రవేశపెట్టింది. 2010 మార్చి 9వ తేదీన రాజ్యసభ ఈ బిల్లును మూడింట రెండొంతుల మెజారిటీతో ఆమోదించింది. ఆమోదానికి ముందు బిల్లుపై రెండు రోజులు చర్చ జరిగింది. చర్చ సందర్భంలో నాటకీయ సన్నివేశాలతో పాటు హింసాత్మక ఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. కొందరు ఎంపీలు పరస్పరం దూషించుకోవటంతో పాటు చేయి చేసుకొనే పరిస్థితులు కూడా ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో రాజ్యసభలో మహిళా రిజర్వేషన్ చట్టాన్ని ఆమోదించినప్పటికీ లోక్‌సభ ఆమోదించలేదు. మహిళా రిజర్వేషన్ల కోసం మహిళలు, వామపక్షాలు, ప్రజల నుండి ఒత్తిడి పెరుగుతుండటం, నాడు పార్లమెంటులో గణనీయ శక్తిగా ఉన్న వామపక్షాలు పూర్తి మద్దతివ్వటంతో ఇక వాయిదా వేయటం బిజెపికి సాధ్యం కాలేదు. తప్పనిసరి పరిస్థితులలో 2023లో ఆమోదించినా, అమలుకు ఆటంకాలు కల్పించింది. ఇపుడు రాజకీయ ప్రయోజనాల కోసం తక్షణం అమలు చేయాలని మోడీ యాగీ చేస్తున్నారు. మనువాద దృక్పథం జీర్ణించుకుపోయిన బిజెపి మహిళలు రాజకీయంగా ఉన్నత స్థానాలలోకి రావటాన్ని అంగీకరించదు. మహిళలను అవమానించటం, వారిని వేధించటం బిజెపి, ఆ పార్టీ సోషల్ మీడియా విభాగానికి, వారి నాయకులకు నిత్యకృత్యంగా ఉన్నది. 2002లో గుజరాత్‌లో మహిళలపై అత్యాచారాలు, హింసాకాండను ఏ విధంగా కొనసాగించారో దేశమంతా చూసింది. మోడీ ముఖ్యమంత్రిగా ఉండగానే ఈ దారుణాలు జరిగాయి. బాధితులకు సహాయం చేస్తున్న తీస్తా సెతల్వాద్ లాంటి స్వచ్ఛంద సేవకులను, రాణా ఆయూబ్ లాంటి జర్నలిస్టులను వెంటాడి వేధిస్తున్నారు. సాక్షి మాలిక్, వినేశ్ ఫోగట్ లాంటి క్రీడాకారులను బిజెపి నాయకుడు, రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షుడు వేధిస్తున్నాడని రోజుల తరబడి రోదించినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. మణిపూర్‌లో మహిళలపై అత్యాచారం, నగంగా ఊరేగించటం వంటి వాటికి పాల్పడిన వారిపై ఆ ప్రభుత్వం ఏ మాత్రం చర్యలు తీసుకోలేదు. మతం, ప్రాంతం, గుర్తింపు ఆధారంగా బిజెపి వ్యవహరిస్తున్నది. తమకు కాని మతం, ప్రాంతం వారైతే ఎటువంటి దారుణాలు జరిగినా పట్టించుకోవటం లేదు. గుర్తింపు ఏదైనప్పటికీ మహిళలు మహిళలే. ఒక మహిళ గౌరవాన్ని కాపాడలేని వారు ఇతర మహిళలకు రక్షణ కల్పిస్తారన్నది కల్ల. మహిళల గౌరవాన్ని కాపాడలేని వారు వారిని రాజకీయ అధికారంలో భాగంగా చేసుకుంటారనేది కూడా నమ్మలేం. కాని ప్రస్తుతం మన దేశంలో అమలులో ఉన్న పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళల ఓట్లు సంపాదించాలంటే వారికి రిజర్వేషన్లు, కొంత మేరకు అధికారంలో భాగం కల్పించటం తప్పనిసరి. అందువలన మనువాదం అమలు కోసం సన్నాహాలు చేస్తున్న బిజెపి కూడా మహిళలకు అధికారంలో భాగం కల్పించటం గురించి మాట్లాడుతున్నది. అందువలన మహిళా బిల్లుపై బిజెపి చేస్తున్న ప్రచారం ఎన్నికల లబ్ధి కోసం మినహా నిజంగా మహిళలకు అధికారంలో భాగం పంచటం కోసం చేస్తున్నది కాదు. మహిళలలో పెరుగుతున్న చైతన్యం, వామపక్ష ఉద్యమాల ప్రభావం, బిజెపికి తగ్గుతున్న ప్రజల మద్దతు ఇటువంటి విన్యాసాలు చేయక తప్పని పరిస్థితులను ఆ పార్టీకి కల్పిస్తున్నాయి. బిజెపి ఎటువంటి వాగ్దానాలు చేసినప్పటికీ మహిళల హక్కుల సాధన కోసం జరుగుతున్న పోరాటాలను అడ్డుకోవటం, దారి తప్పించటం ఆ పార్టీకి సాధ్యం కాదు.

# డీలిమిటేషన్ ఏపీ ప్రయోజనాలను దెబ్బతీస్తుంది

నియోజకవర్గాల పునర్విభజన అంశంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల ముఖ్యమంత్రి చంద్రబాబుకు మూడు పేజీల బహిరంగ లేఖ రాశారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 2011 జనాభా లెక్కల ఆధారిత పునర్విభజన ప్రక్రియ రాష్ట్ర ప్రయోజనాలను దారుణంగా దెబ్బతీస్తుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రతిపాదనల వల్ల ఆంధ్రప్రదేశ్ తన రాజకీయ ప్రభావాన్ని కోల్పోవడమే కాకుండా, వేల కోట్ల రూపాయల ఆర్థిక అవకాశాలను కూడా నష్టపోతుందని షర్మిల హెచ్చరించారు. ఇది రాష్ట్ర భవిష్యత్తుకు పెద్ద ముప్పుగా మారుతుందని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు, ముఖ్యంగా ఏపీకి అన్యాయం చేసే ఈ డీలిమిటేషన్ ప్రక్రియను ముఖ్యమంత్రిగా చంద్రబాబు బహిరంగంగా, నిస్సంకోచంగా వ్యతిరేకించాలని ఆమె కోరారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, పార్టీలకతీతంగా ఆంధ్రప్రదేశ్‌కు చెందిన 25 మంది లోక్‌సభ సభ్యులు, 11 మంది రాజ్యసభ సభ్యులను ఏకతాటిపైకి తీసుకురావాలని సూచించారు. పార్లమెంటులో ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసేలా అందరినీ ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై చర్చించేందుకు అత్యవసరంగా ఒకరోజు ప్రత్యేక శాసనసభ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని షర్మిల కోరారు. డీలిమిటేషన్ ఫ్రేమ్‌వర్క్‌ను తిరస్కరిస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసి, దానిని కేంద్రానికి పంపాలని సూచించారు. ఇది కేవలం రాజకీయ నిర్ణయం మాత్రమే కాదని, భావితరాల భవితను కాపాడే రాజ్యాంగ బాధ్యతని ఆమె గుర్తు చేశారు. కేంద్రంలో అధికార కూటమిలో భాగస్వామిగా ఉన్న టీడీపీ, రాష్ట్ర హక్కుల కోసం గట్టిగా నిలబడాలని ఈ లేఖ ద్వారా ఆమె విజ్ఞప్తి చేశారు.

# క్రీడా దిగ్గజాలతో నారా లోకేశ్ ముఖాముఖి... సూచనలు, సలహాలు స్వీకరణ

- మొదటి పేజి తరువాయి

బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు మాట్లాడుతూ, పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు ఇష్టమైన క్రీడలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్ వేసవి శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేయాలని, ప్రతిభావంతులను గుర్తించి ప్రోత్సహించాలని కోరారు. అర్జున అవార్డు గ్రహీత కరణం మల్లేశ్వరి మాట్లాడుతూ, ఢిల్లీ స్పోర్ట్స్ యూనివర్సిటీ తరహాలో ఏపీలోనూ క్రీడాకారుల కోసం ప్రత్యేక కరిక్యులమ్ రూపొందించే అంశాన్ని పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

గతంలో తనకు మంత్రి లోకేష్ అండగా నిలిచారని ప్రముఖ అథ్లెట్ యర్రాజీ జ్యోతి గుర్తుచేసుకున్నారు. అథ్లెటిక్స్‌తో పాటు ఇతర క్రీడలకు మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు. డీఎస్సీలో స్పోర్ట్స్ కోటా కింద 421 మందికి ఉద్యోగాలు కల్పించడం పట్ల ఖోఖో క్రీడాకారుడు శివారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని హాకీ క్రీడాకారులను ప్రోత్సహించాలని హాకీ క్రీడాకారిణి రజని కోరారు. 2028 ఒలింపిక్స్‌కు సిద్ధమవుతున్న తనకు ప్రభుత్వం ఆర్థిక సాయం ం అందించాలని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సూర్య చరిష్మ అభ్యర్థించారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో క్రీడారంగం మళ్లీ అభివృద్ధి పథంలో పయనిస్తుందని పలువురు క్రీడాకారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కిడాంబి శ్రీకాంత్, ఇల్లూరి అజయ్ కుమార్ రెడ్డి, లలిత్ బాబు, షేక్ అర్షద్‌తో పాటు పలువురు క్రీడాకారులు, శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు పాల్గొన్నారు.

# రామాలయ నిర్మాణానికి కోటి రూపాయల విరాళాలు

పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడులో రామాలయ పునర్నిర్మాణం కోసం భక్తుల నుంచి కోటి రూపాయల విరాళాలు సమకూరాయని ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు వెల్లడించారు. ఈ ఆలయ నిర్మాణానికి సంబంధించి హైకోర్టులో జరుగుతున్న విచారణపై ఆయన ఈరోజు స్పందించారు. త్వరలోనే అన్ని రకాల ప్రభుత్వ అనుమతులతో అత్యంత వైభవంగా ఆలయాన్ని నిర్మిస్తామని ఆయన స్పష్టం చేశారు.ఆకివీడులో పురాతన రామాలయం ఉందనే విషయం సాక్షి మీడియా కథనాల ద్వారానే తనకు మొదట తెలిసిందని, అయితే అక్కడకు వెళ్లినప్పుడు తనపై దాడి చేయించారని రఘురామ ఆరోపించారు. అనుమతి లేకుండా ఆలయం నిర్మిస్తున్నారని న్యాయవాది జడా శ్రవణ్ మరికొందరు హైకోర్టులో పిటిషన్ వేశారని, దీనిపై నేడు విచారణ జరిగిందని తెలిపారు. ఆలయం, మసీదు లేదా చర్చి.. ఏదైనా సరే జిల్లా కలెక్టర్ అనుమతి తప్పనిసరని, చట్టబద్ధంగానే రామాలయ నిర్మాణం చేపడతామని కోర్టుకు విన్నవించినట్లు చెప్పారు.ఆలయ నిర్మాణానికి నిబంధనలు గుర్తు చేస్తున్నారని, కానీ కొందరు నిర్వహిస్తున్న చర్చిలకు మాత్రం ఎటువంటి అనుమతులు లేవని రఘురామ ఆరోపించారు. తాడేపల్లిగూడెంలో మీటింగ్ హాల్ పేరుతో అనుమతి తీసుకుని చర్చిగా మార్చారని, దీనిపై అధికారులు నోటీసులు ఇచ్చినా స్పందన లేదని మండిపడ్డారు.నంబూరు వద్ద ఉన్న కల్వరి టెంపుల్‌తో సహా పలు ప్రాంతాల్లో ప్రార్థనా మందిరాలను వ్యాపార కేంద్రాలుగా మారుస్తున్నారని, ఇలాంటి అక్రమ నిర్మాణాలపై అధికారులు విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పల్లె ప్రజల కోసం 62 అన్న క్యాంటీన్లు ప్రారంభం...

- మొదటి పేజి తరువాయి

ఏర్పాటు చేసిన గ్రామీణ అన్న క్యాంటీన్‌ను ఆయన కార్మికులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రూ.5 వెచ్చించి టోకెన్ కొనుగోలు చేసి, అక్కడి కార్మికులతో కలిసి భోజనం చేశారు. అంతకుముందు, క్యాంటీన్‌కు వచ్చిన పేదలకు, కార్మికులకు ఆయనే స్వయంగా వడ్డించారు.ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ, "పేదవాడి ఆకలి తీర్చడానికే ప్రజా ప్రభుత్వం అన్న క్యాంటీన్లు తెచ్చింది. ఎన్టీఆర్ రూ.2కే కిలో బియ్యం ఇచ్చి ఆహార భద్రతకు నాంది పలికారు. అదే స్ఫూర్తితో సంక్షేమాన్ని కొనసాగిస్తున్నాం" అని అన్నారు. 2024లో అధికారంలోకి రాగానే తొలుత పట్టణాల్లో, ఇప్పుడు గ్రామీణ ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని గుర్తుచేశారు. కొత్తగా 62 గ్రామీణ క్యాంటీన్లు ప్రారంభం కావడంతో, రాష్ట్రంలో మొత్తం క్యాంటీన్ల సంఖ్య 269కి చేరిందని, త్వరలో మరో 5 సిద్ధమవుతాయని వివరించారు.అన్న క్యాంటీన్ల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రోజూ 2.10 లక్షల మంది ఆకలి తీర్చుకుంటున్నారని, దీనికోసం ప్రభుత్వం రోజుకు రూ.54 లక్షలకు పైగా ఖర్చు చేస్తోందని సీఎం తెలిపారు. నాణ్యమైన భోజనం అందించడంలో అక్షయపాత్ర ఫౌండేషన్ సేవలను ఆయన అభినందించారు. కొత్తగా ప్రారంభించిన క్యాంటీన్ల నిర్మాణానికి రూ.43 కోట్లు, వాటి నిర్వహణకు ఏడాదికి అదనంగా రూ.58 కోట్లు ఖర్చవుతుందని పేర్కొన్నారు.

ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంపై చంద్రబాబు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. "గత పాలకులు అన్న క్యాంటీన్లను మూసివేసి పేదల పొట్టగొట్టారు. వారికి విధ్వంసం, హింస, కూల్చడం మాత్రమే తెలుసు. అందుకే ఆ పార్టీ పేరును 'గొడ్డలి పార్టీ'గా మార్చుకోవాలి. ఒక రాజకీయ పార్టీగా ఉండే అర్హతను వైసీపీ కోల్పోయింది" అని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే ప్రవీణ్, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా తదితరులు పాల్గొన్నారు.

# మళ్లీ తోక జాడిస్తున్న పాక్...

## భారత్‌లో చొరబడేందుకు 800 మంది టెర్రరిస్టులు సిద్ధం!

- మొదటి పేజి తరువాయి

పునరుద్ధరిం చినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి.ప్రస్తుతం ప్రపంచ దేశాల దృష్టి మధ్యప్రాచ్య సంక్షోభంపై కేంద్రీకృతమై ఉండటం, అదే సమయంలో భారత్‌లో పలు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో ఇదే అదనుగా భావించి పాక్ ఈ కుట్రకు పాల్పడుతోందని ఓ అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని వాడుకొని భారీ ఎత్తున ఉగ్రవాదులను కశ్మీర్‌లోకి పంపాలని ఐఎస్ఐ, పాక్ సైన్యం భావిస్తున్నట్లు నిఘా వర్గాలు పేర్కొన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని లాంచ్‌ప్యాడ్‌లకు ఇప్పటికే పెద్ద సంఖ్యలో ఉగ్రవాదులను తరలించి, చొరబాటుకు సిద్ధంగా ఉంచారని సమాచారం.ఇటీవలి కాలంలో భారత భద్రతా బలగాల అప్రమత్తతతో పలు చొరబాటు యత్నాలు విఫలమయ్యాయి. దీంతో పాక్ తన వ్యూహాన్ని మార్చుకుంది. ఇప్పుడు ఒకేసారి పలు ప్రాంతాల నుంచి 10 నుంచి 15 మంది చొప్పున ఉగ్రవాదుల బృందాలను పంపి, భద్రతా బలగాల దృష్టిని మరల్చాలని చూస్తోంది. ఈ పద్ధతిలో కనీసం కొందరైనా లోపలికి ప్రవేశించగలరని వారు భావిస్తున్నారు.గతేడాది భారత బలగాలు నిర్వహించిన 'ఆపరేషన్ సిందూర్' తర్వాత ఉగ్రవాద మౌలిక సదుపాయాలు దెబ్బతినడంతో పాక్‌పై ఒత్తిడి పెరిగింది. దీంతో కశ్మీర్‌లో కార్యకలాపాలు నిలిచిపోవడంపై లష్కరే తోయిబా వంటి ఉగ్రవాద సంస్థల నుంచి ఐఎస్ఐపై ఒత్తిడి వస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక నెట్‌వర్క్‌లు బలహీనపడటంతో, సరిహద్దుల నుంచి శిక్షణ పొందిన, యుద్ధ నైపుణ్యం ఉన్న ఉగ్రవాదులను పంపి భారీ దాడులకు పాల్పడాలని ఐఎస్ఐ యోచిస్తున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

# సత్యసాయి జిల్లాలో భారీ పేలుడు.. ఐదుగురి మృతి...

- మొదటి పేజి తరువాయి

మృతి చెందారు. ఈ ఘోర ప్రమాదంలో మరో 20 మంది గాయపడ్డారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది.వివరాల్లోకి వెళితే, కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లి గ్రామంలోని ఓ కూలీ ఇంట్లో మంగళవారం ఈ దుర్ఘటన జరిగింది. ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన నాలుగు డిటోనేటర్లు మొదట పేలాయి. ఈ పేలుడు ధాటికి మంటలు చెలరేగి, అక్కడే ఉన్న గ్యాస్ సిలిండర్లకు అంటుకున్నాయి. దీంతో భారీ శబ్దంతో పేలుడు సంభవించి, ఇల్లు పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు అక్కడికక్కడే మృతి చెందారు.ప్రమాద సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను హుటాహుటిన కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో 12 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ దుర్ఘటనపై మంత్రి సత్యకుమార్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, అక్రమంగా డిటోనేటర్లు ఎందుకు నిల్వ ఉంచారనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

## దొంగల్లా ఎత్తుకెళ్లడం దేనికి?

# పూడి శ్రీహరి అరెస్టుపై పేర్ని నాని నిప్పులు

- మొదటి పేజి తరువాయి

ఎదిగిన వ్యక్తిని ఉగ్రవాదిలా చిత్రీకరిస్తూ కంప్యూటర్లు, ఫోన్లు సీజ్ చేయడం దారుణమన్నారు.

జగన్ చుట్టూ ఉన్నవారిని భయపెట్టాలనే కుట్రతోనే 20 నెలలుగా తప్పుడు కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి చర్యలతో, జగన్ వెంట జెండా మోసేవారిని ఆపలేరని స్పష్టం చేశారు. "శ్రీహరిని 15 రోజులు జైల్లో పెట్టగలరు, అంతకంటే ఏం చేయగలరు? జైలు నుంచి వచ్చాక ఆయన మళ్ళీ జగన్ కోసమే పనిచేస్తారు" అని అన్నారు. లోకేశ్ మాటలు విని పోలీసు వ్యవస్థను పతనావస్థకు తీసుకెళుతున్నారని, దీని పర్యవసానాలను చంద్రబాబు అనుభవించక తప్పదని హెచ్చరించారు. రాజకీయ కక్షల కోసం పోలీసులను వాడుకున్న ఏ ప్రభుత్వం కూడా బతికి బట్టకట్టలేదని గుర్తు చేశారు.ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నిస్తున్నందుకే అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని, ప్రజలు ఇప్పటికే చంద్రబాబుకు మంగళహారతి పాడేందుకు సిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా తప్పుడు కేసులు పెట్టడం మానుకోవాలని, అధికార దుర్వినియోగానికి పాల్పడవద్దని చంద్రబాబు, లోకేశ్ లకు హితవు పలికారు. పోలీసులు కూడా అతిగా వ్యవహరించి భవిష్యత్తులో ఇబ్బందులు కొనితెచ్చుకోవద్దని సూచించారు.

# మత్స్యకారులకు సీఎం చంద్రబాబు ద్రోహం

- మొదటి పేజి తరువాయి

ప్రశ్నించారు. చంద్రబాబు ప్రభుత్వం మత్స్యకారులకు మేలు చేయకపోగా, వారి పొట్ట కొడుతోందని విమర్శించారు. జువ్వలదిన్నె నుంచి మత్స్యకారులను తరిమివేసేందుకు కుట్ర జరుగుతోందని ఆరోపించారు.మార్చి 12న నారా లోకేశ్ జువ్వలదిన్నెను సందర్శించగా, 16న ఇక్కడ సీజ్ చేసిన బోట్లు ఎత్తుకెళ్లిపోయారని జగన్ ఆరోపించారు. అధికారంలో ఉన్న పెద్దలే ఈ దొంగతనం చేశారని, అందుకే ఒక్కరినీ అరెస్టు చేయలేదని అన్నారు. బోట్లు ఎత్తుకెళ్లేవారికి ముఖ్యమంత్రి కొడుకు ఆశీస్సులు ఉన్నాయని సంచలన వ్యాఖ్యలు చేశారు.మూడేళ్లు కళ్లు మూసి తెరిచేలోగా గడిచిపోతాయని, ఆ తర్వాత వచ్చేది తమ ప్రభుత్వమేనని జగన్ ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి రాగానే ప్రైవేట్ డిఫెన్స్ కంపెనీని ఇక్కడి నుంచి తరలిస్తామని హామీ ఇచ్చారు. ఫిషింగ్ హార్బర్లు మత్స్యకారుల హక్కు అని, వాటిని చంద్రబాబు తాత కూడా వారి నుంచి తీసుకోలేరని జగన్ స్పష్టం చేశారు.

# ఈ 9 పనులు చేస్తామని మాటివ్వండి

- మొదటి పేజి తరువాయి

ఈ ప్రమాణాలను శ్రద్ధగా, నిజాయతీగా పాటిస్తే కర్ణాటకతో పాటు దేశ అభివృద్ధి వేగంగా జరుగుతుంది" అని మోదీ వెల్లడించారు. ప్రధాని అడిగిన హామీలు ఏంటంటే..

నీళ్లను వృథా చేయకుండా పొదుపుగా వాడదాం.
పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటిద్దాం
అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం.
'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను చాటి చెబుదాం.
జాతీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేద్దాం.
రసాయనాలు లేకుండా పంట సాగు చేద్దాం.
ఆహారంలో మిల్లెట్స్‌ని భాగం చేసుకుందాం.
నూనె పదార్థాలను పూర్తిగా తగ్గిద్దాం.
ఫిట్‌గా, బరువుని అదుపులో ఉంచుతూ, ప్రకృతికి సేవ చేద్దాం

ఇక, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని గుర్తుచేశారు.

# ఇరాన్‌కు ఇక ఆయుధాలు పంపబోమని చైనా చెప్పింది

- మొదటి పేజి తరువాయి

చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో, వ్యూహాత్మకంగా కీలకమైన హర్మ్యూజ్ జలసంధిని శాశ్వతంగా తెరిచి ఉంచేందుకు తాను చేస్తున్న ప్రయత్నాలకు చైనా మద్దతు తెలిపిందని ఆయన పేర్కొన్నారు.ఈ విషయంపై తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో ట్రంప్ ఒక పోస్ట్ చేశారు. "ఇకపై హర్మ్యూజ్ ను మూసి ఉంచడం జరగదు. హర్మ్యూజ్ జలసంధిని నేను శాశ్వతంగా తెరుస్తుండటం చైనాకు చాలా సంతోషాన్నిచ్చింది. అమెరికాతో పాటు ప్రపంచం కోసం నేను ఈ పని చేస్తున్నాను. వారు ఇరాన్‌కు ఆయుధాలు పంపబోమని అంగీకరించారు" అని ఆయన రాసుకొచ్చారు.ప్రపంచ ఇంధన సరఫరాలో హోర్ముజ్ జలసంధి చాలా కీలకమైనది. ఇటీవలి కాలంలో ఈ ప్రాంతంలో ఉద్రిక్తతలు పెరిగాయి. మరోవైపు, చైనా ఇరాన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తోందంటూ గతంలో వార్తలు వచ్చిన నేపథ్యంలో ట్రంప్ తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో తనకున్న సంబంధాల గురించి కూడా ట్రంప్ ప్రస్తావించారు. "నేను చైనా వెళితే అధ్యక్షుడు షీ జిన్ పింగ్ నన్ను గట్టిగా ఆలింగనం చేసుకుంటారు. మేమిద్దరం కలిసి తెలివిగా పనిచేస్తున్నాం. ఇది యుద్ధం కన్నా మంచిది కదా?" అని వ్యాఖ్యానించారు. అయితే, అవసరమైతే యుద్ధానికి కూడా అమెరికా సిద్ధమేనని హెచ్చరించారు.కాగా, అమెరికాతో ఇరాన్ చర్చలకు పాకిస్థాన్ మధ్యవర్తిత్వం నెరుపుతున్నప్పటికీ, ఇరాన్ ను చర్చల వరకు తీసుకురావడం వెనుక చైనా హస్తం ఉందని ఇప్పటికే పలు కథనాలు వచ్చాయి. తెరవెనుక చైనా మంత్రాంగం నడుపుతోందని భావిస్తున్నారు. ఈ క్రమంలో, ట్రంప్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# మోదకొండమ్మ తల్లి పండుగ తేదీలు మార్పు సరికాదు



- గుమ్మడి సంధ్యారాణి గిరిజన పండగల్లో రాజకీయం చేయడం మానుకోవాలి.
- పండుగ తేదీలో మార్పుపై తీవ్రంగా ఖండించిన జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 15.** పాడేరు మోదకొండమ్మ పండగ చేతుల మార్పులు సరికాదని ఉమ్మడి విశాఖ జిల్లా చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ.. అన్నా క్యాంటీన్ ప్రారంభకొచ్చి పండుగ తేదీలను మార్చేస్తారా.. అని ఆగ్రహం వ్యక్తం చేశారు. మే 12న మోదకొండమ్మ తల్లి జన్మదినం కావున ఆ తేదీలను కలుపుకొని ప్రతి ఏడాది పండుగ నిర్వహిస్తారనీ, మే13న పాడేరులో టిడిపి నేత పెళ్లితో పండుగ తేదీ మార్పుకు ప్రధాన కారణంగా అర్థమవుతుందన్నారు. మోదకొండమ్మ ఆలయ కమిటీ చైర్మన్, ఆలయ కమిటీ పెద్దలు, గిరిజన పెద్దలు, గిరిజన మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు అంతా కలిసి రెండు నెలల క్రితమే పండుగ తేదీని ప్రకటించారన్నారు. ఎప్పుడూ లేని విధంగా మంత్రి గుమ్మడి సంధ్యారాణి గిరిజనుల మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించడం అమ్మవారి ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు. జెడ్పీ చైర్ పర్సన్, అరకు ఎంపీ, ఎమ్మెల్యే లను పిలవకుండా మంత్రి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం సరికాదన్నారు. పండగ తేదీలు మార్చి తన నిర్ణయాలను అధికారుల మాటల్లో వినిపించడం విడ్డూరంగా ఉందనీ, ముందు ప్రకటించిన తేదీల్లోనే పాడేరు మోదకొండమ్మ పండగ జరగాలని జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్ర డిమాండ్ చేశారు.

# పెన్ పవర్ ఉత్తరాంధ్ర

శ్రీకాకుళం । మన్యం । విజయనగరం । విశాఖపట్నం । అనకాపల్లి । అల్లూరి జిల్లా

# ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి పౌష్టికాహారం దోహదపడుతుంది....

**పోషణ్‌పక్వాడ్ కార్యక్రమం లో ఐసిడిఎస్ పర్యవేక్షకులు.**



**సాలూరు పెన్ పవర్ ఏప్రిల్ 15:** పౌష్టికాహారం ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుందని ఐసిడిఎస్ పర్యవేక్షకలు అనూరాధ,లక్ష్మిలు అన్నారు.బుధవారం మండలంలోని కందులపదం గ్రామంలో సెక్టార్ లో ఉన్న కార్యకర్తలతో కలిసి పోషణ్‌పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహారం వలన ఆరోగ్య సంరక్షణ ఉంటుందన్నారు.గర్భవతి అయిన నుండి బిడ్డకు రెండు సంవత్సరాలు నిండేవరకు మధ్య ఉన్నకాలం 1000 రోజులు,ఈ వెయ్యి రోజులలో తల్లి,బిడ్డకు పోషకాలతో కూడిన ఆహారం అందించడం వలన బిడ్డ ఆరోగ్యంగా ఎదిగేందుకు దోహదపడుతుందన్నారు,లేనిఎడల బిడ్డ జీవితకాలం లోపం తో జీవించాల్సి వస్తుందన్నారు.అందుకే ఈ వెయ్యి రోజులను ముఖ్యమైనవిగా గుర్తించాలన్నారు.పోషకాహారం తీసుకోవడం వలన తల్లి ఆరోగ్యం తో పాటు శిశువు శారీరక,మానసిక అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.కౌమార దశలో ఉన్న బాలికలు,గర్భిణీలు,బాలింతలు పౌష్టికాహారం తీసుకోవడం పై దృష్టి పెట్టాలన్నారు. ఏప్రిల్ 9 వ తేదీ నుండి 23 వరకు 8వ పోషణ్‌పక్వాడ్ పక్షోత్సవాలు నిర్వహిస్తామన్నారు.టాటా ట్రస్ట్ ప్రతినిధి రాంబాబు గర్భిణీ లకు యాపిల్ పండ్లను పంచిపెట్టారు. ఈ కార్యక్రమం లో అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు......

# నర్సీపట్నంలో సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్ ప్రారంభం



**నర్సీపట్నం, పెన్ పవర్ (ఏప్రిల్ 15) :** చిన్నారులు, యువతలో క్రీడా నైపుణ్యాలను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో నర్సీపట్నంలో సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్ ప్రారంభమైంది. నేషనల్ స్పోర్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ క్యాంప్‌ను అల్లాడ సురేష్, సుతాపల్లి శ్రీకాంత్, సుతాపల్లి శ్రావణ్, వెలగా జగనాథ్ ప్రారంభించారు. క్యాంప్‌కు మద్దతుగా వారు రూ.10,000 విలువైన స్పోర్ట్స్ కిట్లు అందజేశారు. ఈ క్యాంప్ ఈనెల 15 నుండి మే 31 వరకు మొత్తం 45 రోజుల పాటు కొనసాగనుంది. గవర వీధిలో గ్యాస్ ఆఫీసు వెనుకనున్న ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఈ శిక్షణ కార్యక్రమంలో ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు ఆరు బ్యాచ్‌లలో శిక్షణ అందించనున్నారు. కరాటే, యోగా, చెస్, బాక్సింగ్, జూడో, రెజ్లింగ్, క్యారమ్, ఉషూ, కర్రసాము, నాన్‌చక్‌తో పాటు డ్రాయింగ్, డాన్స్ విభాగాల్లో ప్రొఫెషనల్ శిక్షణ ఇవ్వబడుతుంది. ప్రముఖ కోచ్ వేపాడ ప్రియాంక (బ్లాక్ బెల్ట్) సహా సీనియర్ మహిళా కోచ్‌లు శిక్షణ అందించనున్నారు. ఈ క్యాంప్ లో
పాల్గొనే వారికి ప్రతిరోజూ గుడ్లు, పండ్లు, రాగి మాల్ట్ వంటి పోషకాహారం అందించడంతో పాటు, శిక్షణ ముగింపులో సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నారు. ఆసక్తి గల వారు ఒక్కొక్కరు 1 నుండి 3 క్రీడలను ఎంపిక చేసుకుని నమోదు చేసుకోవచ్చని నిర్వాహకులు తెలిపారు. నమోదు కోసం 8125532279, 7382329353 నంబర్లను సంప్రదించాలన్నారు.

# టీడీపీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా మంత్రి నారా లోకేష్ , రాష్ట్ర టిడిపి పార్టీ అధ్యక్షుడు గా పల్లా శ్రీనివాసరావుని నియామకం



**గాజువాక :పెన్ పవర్ ,ఏప్రిల్ 15 :** రెండవసారి రాష్ట్ర టిడిపి అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాస రావుని కొనసాగించడం హర్షించదగ్గ విషయమని గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ అన్నారు. పార్టీ అధిష్ఠానం ప్రకటనతో గాజువాకలో పండగ వాతావరణం నెలకొంది. గాజువాక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల ఆధ్వర్యంలో కేక్ కటింగ్ చేసి వేడుకలు జరుపుకున్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్గా మంత్రి నారా లోకేష్ ని, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావుని కొనసాగించడం వలన పార్టీలో నూతన ఉత్తేజం కలుగుతుందని అన్నారు . పార్టీలో ఉన్న సీనియర్లకు మరియు జూనియర్లకు సామాజిక న్యాయం చేస్తూ పదవులు ఇవ్వడం శుభ పరిణామం అని తెలిపారు. ఎన్నికల్లో రాష్ట్రంలోని అత్యధిక మెజారిటీతో గెలిచిన పల్లా శ్రీనివాసరావు పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని తెలిపారు. తల్లా శ్రీనివాసరావు పనితీరుపై నమ్మకం ఉండడం వల్లనే మరోసారి రాష్ట్ర అధ్యక్షుడిగా పగ్గాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు గంధం శ్రీనివాసరావు, పల్లా శ్రీనివాసరావు, పలు వార్డుల అధ్యక్షులు నల్లూరు సూర్యనారాయణ, కర్రి దసేంద్ర, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు తమిరె శివప్రసాద్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఉత్సవం రెండవ రోజు "చలివేంద్రానికి" విశేష స్పందన.




**వందల సంఖ్యలో ప్రజలకు దాహార్తిని తీరుస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ ఫెడరేషన్ చింతపల్లి ప్రెస్ క్లబ్.**

**చల్లని మజ్జిగ, చల్లని మంచినీరు అందిస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ ఫెడరేషన్ సభ్యులు.**

**చింతపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 15.** చింతపల్లి గ్రామ దేవత ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవాన్ని పురస్కరించుకొని ఏపీడబ్ల్యూ జె ఎఫ్ (ఫెడరేషన్) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రం, ప్లాస్టిక్ వినియోగం వలన కలుగు అనర్థాలపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాలు రెండవ రోజు కూడా దిగ్విజయంగా సాగాయి. మంగళవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించనున్న ముత్యాలమ్మ అమ్మవారి ఉత్సవంలో ప్రజలు భక్తులు దాహార్తికి గురి కాకూడదనే సత్సంకల్పంతో ఏపీడబ్ల్యూజేఎఫ్ (ఫెడరేషన్) ఆధ్వర్యంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం శుభ పరిణామమని యావన్మంది ప్రజానీకం అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మంగళ, బుధవారాలలో నిర్వహించిన చలివేంద్రం వద్ద ఏపీడబ్ల్యూజేఎఫ్ ఫెడరేషన్ సభ్యులు యావన్మంది ప్రజానీకానికి చల్లని త్రాగునీటితో పాటు, చల్లని మజ్జిగను అందిస్తూ భక్తులు, ప్రజల మన్ననలు పొందుతున్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తేవడమే గాక, ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఏపీడబ్ల్యూజేఎఫ్ ఫెడరేషన్ సభ్యులను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు సహా పలువురు ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు వివిధ సంఘాలకు, ప్రజలు ప్రశంసించారు. రెండు రోజులపాటు నిర్విరామంగా చల్లని మజ్జిగ, మంచినీటిని సరఫరా చేసిన ఏపీడబ్ల్యూజే ఎఫ్ ఫెడరేషన్ సభ్యులు మరో రెండు పా రోజులపాటు కూడా ఇదే విధంగా చల్లని మజ్జిగ, చల్లని మంచినీరు అందించేందుకు కృషి చేస్తున్నారు. అదే క్రమంలో ప్లాస్టిక్ వినియోగం వలన కలుగు అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వీరు చేస్తున్న సేవా కార్యక్రమాలకు మంచి స్పందన వస్తుంది.

# సింహాచలం చందనోత్సవం టికెట్లపై దేవస్థానం కీలక హెచ్చరిక

**దళారుల మోసాలకు చెక్ పెట్టిన సింహాచలం దేవస్థానం ఈవో**




**సింహాచలం, పెన్ పవర్, ఏప్రిల్ 15 :** శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం, సింహాచలం, అప్పన్న స్వామివారి ప్రసిద్ధ చందనోత్సవం సందర్భంగా భక్తుల కోసం దేవస్థానం కీలక ప్రకటన విడుదల చేసింది. ప్రతి సంవత్సరం భారీగా భక్తులు హాజరయ్యే ఈ మహోత్సవం నేపథ్యంలో టికెట్ల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలని అధికారాలు స్పష్టంగా సూచించారు. దేవస్థానం ప్రకారం, చందనోత్సవ దర్శన టికెట్లు కేవలం అధికారిక వెబ్‌సైట్ ద్వారా మరియు గుర్తింపు పొందిన బ్యాంకులు అయిన యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖలలో మాత్రమే విక్రయించబడుతున్నాయి. భక్తులు ఈ అధికారిక మార్గాల ద్వారానే టికెట్లు కొనుగోలు చేయాలని సూచించారు. ఇటీవల కొందరు దళారులు నకిలీ టికెట్లను తయారు చేసి అమాయక భక్తులను మోసం చేస్తున్నట్లు దేవస్థానం దృష్టికి వచ్చింది. అనధికారిక వ్యక్తులు లేదా కేంద్రాల వద్ద టికెట్లు కొనుగోలు చేస్తే దర్శనం నిరాకరించబడుతుందని అధికారులు హెచ్చరించారు. నకిలీ టికెట్లతో వచ్చే వారికి ఎలాంటి అనుమతి ఉండదని స్పష్టం చేశారు. ఇలాంటి మోసపూరిత చర్యలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ముఖ్యంగా సెక్షన్ 420 కింద మోసం కేసులు, సెక్షన్ 468 & 471 కింద నకిలీ పత్రాల తయారీ మరియు వినియోగం, అలాగే సెక్షన్ 66 ఐటీ యాక్ట్ కింద ఆన్‌లైన్ మోసాలకు సంబంధించిన కేసులు నమోదు చేయబడతాయని పేర్కొన్నారు. టికెట్లు అమ్మేవారితో పాటు అక్రమంగా కొనుగోలు చేసే వారిపైనా చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు.
భక్తులు ఎవరైనా దళారులు లేదా నకిలీ టికెట్ల విక్రయాల గురించి సమాచారం తెలిసిన వెంటనే దేవస్థానం అధికారులకు తెలియజేయాలని లేదా గోపాలపట్నం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని కోరారు. చివరగా, భక్తులందరూ సహకరించి అధికారిక మార్గాల్లోనే టికెట్లు పొందాలని, ఈ పవిత్ర చందనోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో విజయవంతం చేయాలని దేవస్థానం కార్యనిర్వహణాధికారి విజ్ఞప్తి చేశారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# విద్యార్థులకు సామాజిక అంశాలపై అవగాహన సదస్సు

- సెలవుల సమయంలో జలపాతాలు మత్స్యగెడ్డ వైపు వెళ్లరాదని సూచనలు.
- పిల్లలపై తల్లితండ్రులు బాధ్యతలు మెలగాలి.
- ఎస్సై పి నానీ, ఎంపీడీవో ధర్మారావు, తహసిల్దార్ భాస్కర అప్పారావు.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 15.** అల్లూరి జిల్లా ఎస్పీ ఆదేశాలతో ముంచంగిపుట్టు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాలలు1, 2 విద్యార్థినులకు సామాజిక అంశాలపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు ఎస్సై పీ నాని తెలిపారు. బుధవారం ఎంపీడీవో ధర్మారవు మండల తహసీల్దార్ భాస్కర అప్పారావు, ఎఫ్.ఆర్.ఓ ఎస్.హెచ్.ఓ సంయుక్తంగా పాల్గొని విద్యార్థినులకు సమాజంలో జరుగుతున్న చెడుపై అప్రమత్తంగా ఉండాలంటూ దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జలవనరుల వద్ద భద్రత విషయంలో సెలవుల్లో లేదా విహారయాత్రల్లో భాగంగా చెరువులు, జలపాతాల వద్దకు వెళ్ళినప్పుడు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సోషల్ మీడియాకు విద్యార్థి దశలో సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండి, కేవలం విద్యపైనే దృష్టి సారించాలని వారు సూచించారు. అలాగే బాల్య వివాహాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరిస్తూ వీటిని అరికట్టడంలో విద్యార్థినుల పాత్రను గుర్తుచేశారు. మహిళా రక్షణ చట్టాలు మహిళా భద్రత కోసం ఉన్న చట్టాలు పోలీస్ శాఖ ద్వారా అందుబాటులో ఉన్న రక్షణ కవచాల గురించి అవగాహన కల్పించారు. అలాగే జోలపుట్టు ప్రధాన రిజర్వాయర్ డుడుమా జలపాతాలు, సుజనకోట మత్స్యగెడ్డ, బాబుశాల జలపాతాలు తదితర పర్యాటక ప్రాంతాల్లో గల పాత్రలో విహార యాత్రలకు వెళ్ళినప్పుడు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. చేతులలో మొబైల్ ఉందని సెల్ఫీలు జలపాతల వద్ద దిగేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలని అప్రమత్తంగా ఉంటే ప్రాణాలు పోతాయని పలు సూచనలు సలహాలు అందించారు. సెలవుల అనంతరం విద్యార్థిని విద్యార్థులు గెడ్డల వైపు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు పాటించి ఇంట్లో ఉండే విధంగా చూసుకోవాలని వారు తెలిపారు.



# మంత్రి సంధ్యారాణికి వినతి పత్రం అందజేసిన గిరిజన ఉద్యోగుల సంఘం

**పాడేరు, పెన్ పవర్, ఏప్రిల్ 15:**పాడేరు పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణిని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షులు మసాడా ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి శేషాద్రి కలిసి గిరిజన ఉద్యోగులు, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై మంత్రికి వినతి పత్రం అందజేశారు.

ప్రస్తుతం నెలకొన్న ప్రాంతీయ విభజన పద్ధతి సమస్యను పరిష్కరించి, గిరిజన ప్రాంత నిరుద్యోగులకు, ఉద్యోగులకు న్యాయం చేయాలని, అలాగే గతంలో ఉన్న నియామక నిబంధనల స్థానంలో గిరిజన నిరుద్యోగులకు మేలు చేసేలా నూతనంగా "షెడ్యూల్ ప్రాంత ఉద్యోగ నియామక చట్టం" తీసుకురావాలని వినతి పత్రంలో కోరారు.

ఈ సందర్భంగా మసాడా ఈశ్వరరావు మాట్లాడుతూ, ఈ సమస్యలను తక్షణమే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి, సానుకూల నిర్ణయం తీసుకునేలా చొరవ చూపాలని మంత్రిని కోరడం జరిగిందని తెలిపారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు



## పాడేరులో విజయవంతంగా ముగిసిన ఎస్ఎస్‌సి స్పాట్ వాల్యుయేషన్ క్యాంపు

* అధికారులను, ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించిన ఏపీసీపీఎస్




**పాడేరు, పెన్ పవర్, ఏప్రిల్ 15:**అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులో గత పది రోజులుగా నిర్వహించిన ఎస్ఎస్‌సి స్పాట్ వాల్యుయేషన్ క్యాంపు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విజయవంతంగా ముగిసింది.

ఈ క్యాంపును ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఉపాధ్యాయులకు అన్ని వసతులు కల్పించి, చక్కగా నిర్వహించిన జిల్లా విద్యాశాఖ అధికారి డా. రామకృష్ణారావు, ఏసీ శశికుమార్, పీజీ హెచ్ఎంఎస్ ప్రసాదరావు, సుజాత మేడమ్, ధర్మాన, గోపాల్ రాజులను ఏపీసీపీఎస్ జిల్లా అధ్యక్షులు మోరీ మోహన్‌బాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అలాగే వాల్యుయేషన్ విధుల్లో పాల్గొని సహకరించిన గెమ్మెలి రాజబాబు, లింగన్న, వందేమాతరం శ్రీను, మరియు పీఎస్ టీచర్లు ప్రకాష్, బెన్నీ, శ్యాం, భాస్కర్, బాలు, వాసు తదితరులను శాలువాలు కప్పి సత్కరించారు.

ఈ సందర్భంగా ఏపీసీపీఎస్ నాయకులు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన మూల్యాంకన ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో పూర్తి చేసిన అధికారులకు, ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా అధికారులు తీసుకున్న చర్యలు అభినందనీయమని కొనియాడారు.

## క్లాప్ మిత్రులకు వెంటనే జీతాలు చెల్లించాలి: అరికట్ల ఆంజనేయులు



**గూడెం కొత్త వీధి,పెన్ పవర్,ఏప్రిల్ 15:** గ్రామాల పరిశుభ్రత కోసం సేవలందిస్తున్న క్లాప్ మిత్రులకు వెంటనే జీతాలు మంజూరు చేయాలని వైసీపీ నాయకుడు అరికట్ల ఆంజనేయులు(అంజి) డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్లాప్ మిత్రాలపై అధికారులు చిన్నచూపు చూడడం బాధాకరమని, వారికి ఇవ్వాల్సిన వేతనాలను నిలిపివేసి ఇతర అవసరాలకు నిధులు మళ్లించడం సమంజసం కాదన్నారు.పంచాయతీలలో పరిశుభ్రత పనులతో పాటు కొంతమంది కార్యదర్శులు క్లాప్ మిత్రులతో ఇతర పనులు కూడా చేయిస్తున్నారని ఆరోపించారు. దీనికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. ఇది సరైన విధానం కాదని, క్లాప్ మిత్రులను కేవలం గ్రామాల పరిశుభ్రత పనులకే పరిమితం చేయాలని సూచించారు.జీతాలు చెల్లించకపోవడంతో క్లాప్ మిత్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వారి పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేసి, సమయానికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అరికట్ల ఆంజనేయులు కోరారు.

## 16 గ్రామ పంచాయతీల ఓటర్ జాబితా విడుదల




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 15**:తహసీల్దార్ కార్యాలయంలో 16 గ్రామ పంచాయతీల సాధారణ ఎన్నికల ఓటర్ జాబితాను అధికారికంగా విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రమణబాబు, తహసీల్దార్ అన్నజీరావు, ఉప మండల అభివృద్ధి అధికారి రత్నకుమార్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ప్రజలు తమ పేర్లు ఓటర్ జాబితాలో ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించాలని సూచించారు. జాబితాలో ఏవైనా తప్పులు లేదా లోపాలు ఉన్నట్లయితే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. అలా చేస్తే సవరణలు చేసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.అలాగే అన్ని పంచాయతీ కేంద్రాలలో ఓటర్ జాబితాలను ప్రదర్శించినట్లు తెలిపారు. ప్రతి ఓటరు తన పేరు నమోదు అయినదాన్ని నిర్ధారించుకొని, రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఈవోపిఆర్డి కిట్లంగి బాలకృష్ణ, జీకే వీధి పంచాయతీ కార్యదర్శి పండ్రా పాల్ తదితరులు పాల్గొన్నారు.

# మే 17 నుంచి మొదకొండమ్మ అమ్మవారి జాతర: ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి సంధ్యారాణి





**పాడేరు, పెన్ పవర్, ఏప్రిల్ 15:** పాడేరు గిరిజన దేవత మొదకొండమ్మ అమ్మవారి జాతర సందర్భంగా మే 17, 18, 19 తేదీలలో నిర్వహించనున్న ఉత్సవాల ఏర్పాట్లను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రత్యక్షంగా పరిశీలించారు.

జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలు, వాహనాల రాకపోకల నిర్వహణ వంటి అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

జాతర సమయంలో భక్తులకు సురక్షితమైన వాతావరణం కల్పించడం అత్యంత ముఖ్యమని మంత్రి పేర్కొన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన మొదకొండమ్మ అమ్మవారి జాతరను ఘనంగా నిర్వహించేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.

పాడేరులో అన్న క్యాంటీన్ ప్రారంభించిన మంత్రి సంధ్యారాణి

పాడేరు పట్టణంలో అన్న క్యాంటీన్ ను మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రారంభించారు.

పేదలు, కార్మికులు మరియు సాధారణ ప్రజలకు తక్కువ ధరలో పరిశుభ్రమైన ఆహారం అందించడమే అన్న క్యాంటీన్ లక్ష్యమని మంత్రి తెలిపారు.

## జంక్ ఫుడ్ లు వద్దు.. ఇంటి వంటలె ముద్దు.. సిడిపిఓ నాగమణి..



**చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్,15** . ప్రతి ఒక్కరూ జంక్ ఫుడ్ లకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన ఇంటి వంటలతోనే సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందగలరని చీపురుపల్లి ఐసిడిఎస్ సిడిపిఓ పి నాగమణి అన్నారు. బుధవారం నాడు చీపురుపల్లి పట్టణంలోని విజయ కాలనీ అంగన్వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా స్నాప్ ది స్నాక్ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిబిడ్డ ఆరోగ్యంగా ఉండటానికి అంగన్వాడీ కేంద్రాల ద్వారా అమలు జరుగుతున్న పౌష్టికాహారాన్ని పొందాలని కోరారు. జంక్ ఫుడ్ ల కారణంగా అనారోగ్యం పాలు కాగలరని ఆమె వివరించారు. పోషణ పక్వాడ 8వ పోషణ ప క్షోత్సవాల్లో అంగన్వాడీ కేంద్రంలో తల్లుల తో సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్యంగా తల్లి బిడ్డలు, గర్భిణీ స్త్రీలు, బాలింతలకు పౌష్టికాహారమే శ్రేయస్కరమని పిఓ అన్నారు. పిల్లలు మెదడు ఎదుగుదల కు,గర్భిణీ లు ఆరోగ్య పరిరక్షణకు పౌష్టికాహారం తప్పని సరిగా తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో గర్భిణీ లు,బాలింతలు, తల్లిదండ్రులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ శైశవ దశ లోగల పిల్లలు మెదడు ఎదుగుదల కు ,చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు గాను ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. కుటుంబీకులు అంతా బాధ్యత గా ఆహార నియమాలు పాటించి పిల్లలు భవిష్యత్తు, గర్భిణిలు,బాలింతలు ఆరోగ్య అంశం లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతీ ఒక్కరూ జంక్ ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్ పి. శశికళ, అంగన్వాడి టీచర్లు డి భారతీదేవి, పి రాజేశ్వరి, ఎంపీపీ స్కూల్ హెచ్ఎం జిఆర్కేఎస్ రాము, పలువురు లబ్ధిదారులు, బాలింతలు, గర్భిణీలు పాల్గొన్నారు.

## డాక్టర్ కణితి విశ్వనాధం 3వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళులు.



**పలాస: పెన్ పవర్ : ఏప్రిల్ 15**:గ్రామీణ ప్రాంతాల్లో సాంకేతిక విద్యాభివృద్ధికి విశేషంగా కృషి చేసిన మహోన్నత వ్యక్తి, మాజీ పార్లమెంట్ సభ్యులు, 9వ మరియు 10వ లోక్‌సభ సభ్యులుగా సేవలందించిన కీ.శే. డాక్టర్ కణితి విశ్వనాధం 3వ వర్ధంతి సందర్భంగా బుధవారం డాక్టర్ వి. కణితి ప్రభుత్వ ఐటిఐ ప్రాంగణంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పైలా జవహర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు ఇతరులు పాల్గొని డాక్టర్ కణితి విశ్వనాధం గారి సేవలను స్మరించుకున్నారు. డాక్టర్ కణితి విశ్వనాధం గారు గ్రామీణ యువతకు సాంకేతిక విద్య అందించాలని సదుద్దేశంతో 1981లో ఐటిఐను స్థాపించారు. అనంతరం 2010లో 3 ఎకరాలు 27 సెంట్ల స్థలాన్ని మౌలిక వసతులతో సహా ప్రభుత్వానికి దానం చేసి, విద్యాభివృద్ధికి తన అపారమైన కట్టుబాటును చాటిచెప్పారు.

అంతేకాకుండా సామాజిక సేవలో భాగంగా ఈ గ్రామీణ ప్రాంతంలో 1971–72లో లయన్స్ క్లబ్‌ను స్థాపించి, అనేక సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. వైద్యునిగా సుమారు 55 సంవత్సరాలు ప్రజలకు సేవలందించిన ఆయనను అందరూ ప్రేమతో "డాక్టర్ గారు" అని పిలిచేవారని సభలో పేర్కొన్నారు.

ఈ సందర్భంగా పలువురు ప్రసంగిస్తూ, డాక్టర్ కణితి విశ్వనాధం గారు విద్య, వైద్యం, సామాజిక సేవ రంగాల్లో అందించిన సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలని అన్నారు.

## పేదల ఆకలి తీర్చడమే 'అన్న క్యాంటీన్'ప్రధాన లక్ష్యం.. ఎమ్మెల్యే కళా వెంకటరావు.



**చీపురుపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 15** :పేదల ఆకలి తీర్చడమే ప్రధాన లక్ష్యంగా చీపురుపల్లిలో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడం జరిగిందని చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకటరావు అన్నారు. బుధవారం నాడు చీపురుపల్లి సబ్ రిజిస్టర్ కార్యాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అన్న క్యాంటీన్ భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా క్యాంటీన్లో వండిన వంటకాలను సామాన్యుల తో పాటు రుచి చూశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమ పథకాల్లో భాగంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ క్యాంటీన్‌ను అందుబాటులోకి తీసుకు రావడం జరిగిందన్నారు.

.గత ప్రభుత్వ పాలనలో నిలిచిపోయిన అన్న క్యాంటీన్లను మళ్ళీ ప్రారంభించడం ద్వారా పేదల ఆకలి తీర్చే సువర్ణ అధ్యాయం మొదలైంది అన్నారు. కేవలం ఐదు రూపాయలకే శుభ్రమైన, పోషకాలతో కూడిన ఆహారాన్ని అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశ్యం అని వివరించారు. నిరుపేదలు, కూలీలు మరియు బాటసారులకు ఈ క్యాంటీన్ ఒక వరప్రదాయిని" అని ఆయన పేర్కొన్నారు., చీపురుపల్లి నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇలాంటి మరిన్ని సేవా కార్యక్రమాలు ముమ్మరం చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రౌతు కామ నాయుడు, మాజీ ఆర్ ఇ సి ఎస్ చైర్మన్ దన్నాన రామచంద్రుడు, కే త్రిమూర్తుల రాజు, ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, గరివిడి మాజీ ఎంపీపీ పైల బలరాం, గరివిడి మండల పార్టీ అధ్యక్షులు సురేష్, ఎంపీడీవో సురేష్, తాసిల్దార్ డి ధర్మరాజు, పలువురు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా కిమిడి రామ్ మల్లిక్ నాయుడు,



**చీపురుపల్లిపెన్ పవర్ ఏప్రిల్ 15** . తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శిగా చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకటరావు తనయుడు కిమిడి రామ్ మల్లిక్ నాయుడు ని నియమిస్తూ అధిష్టానం బుధవారంనాడు ఉత్తర్వులను జారీ చేసింది. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా నియమించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ లకు ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ అధిష్టానం తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యత అప్పగించిన నేపథ్యంలో పార్టీ అభివృద్ధికి నిరంతర కృషి చేస్తానని ఆయన వివరించారు.పార్టీ అగ్రనాయకత్వ మార్గదర్శకత్వంలో క్రమశిక్షణతో మెలుగుతూ, పార్టీ బలోపేతానికి మరియు ప్రజా సేవకు నిరంతరం అంకితభావంతో పనిచేస్తానని మల్లిక్ నాయుడు అన్నారు .తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుతూ, పార్టీ విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతానని కిమిడి రామ్ మల్లిక్ నాయుడు స్పష్టం చేశారు.

# గౌతు శిరీషకు కీలక బాధ్యత: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియామకం.





**పలాస: పెన్ పవర్ :ఏప్రిల్ 15 :**తెలుగుదేశం పార్టీలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కి కీలకమైన పదవి దక్కింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఆమెను నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. ఈ సందర్భంగా ఆమె తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.


ఎమ్మెల్యే గౌతు శిరీష

తనపై నమ్మకంతో ఈ భారీ బాధ్యతను అప్పగించినందుకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, అలాగే జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ కి ఆమె హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...

"తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సేవ చేసే అరుదైన అవకాశాన్ని కల్పించినందుకు పార్టీకి రుణపడి ఉంటాను. నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, పార్టీ బలోపేతం కోసం మరియు ప్రజల సేవ కోసం పూర్తి నిబద్ధతతో, నిరంతర కృషితో ముందుకు సాగుతాను." అని పేర్కొన్నారు.

పలాస నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పార్టీ అభివృద్ధికి, కార్యకర్తల సంక్షేమానికి పెద్దపీట వేస్తానని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు. ఆమెకు ఈ పదవి దక్కడం పట్ల పలాస నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




## పదవి మరింత బాధ్యత పెంచింది.



**పలాస:పెన్ పవర్ ఏప్రిల్ 15:**నన్ను గుర్తించి రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి గా ఎన్నుకున్న పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు కి, నార లోకేష్ కి, రాష్ట్ర మంత్రి వర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు కి, కేంద్ర మంత్రి వర్యులు కింజరాపు రామ్మోహన్ నాయుడు కి, మా శాసనసభ్యురాలు గౌతు శిరీష కి, మాజీ మంత్రి గౌతు శ్యాంసుందర్ శివాజీ కి కృతజ్ఞతలు. నాతో పాటు రాష్ట్ర కమిటీలో ఎన్నికైన శ్రీకాకుళం జిల్లా నాయకులకు శుభాకాంక్షలు తెలిపారు

## కేజీబీవీలదే జిల్లాలో అత్యధిక ఉత్తీర్ణత: 1వ సంవత్సరం 94.43%, 2వ సంవత్సరం 98.79%

Samagra Shiksha, Andhra Pradesh
KGBV INTERMEDIATE 2ND YEAR RESULT 2026
ALLURI SITHARAMA RAJU DISTRICT

| SNO | NAME OF THE DISTRICT | NAME OF THE KGBV | UDISE CODE | GROUP | INTER 2nd YEAR: NO OF STUDENTS APPEARED | NO OF STUDENTS PASSED | NO OF STUDENTS FAILED | PASS % | NAME OF THE STUDENT SCORED HIGHET MARKS | HIGHEST MARKS SECURED | TOTAL 1st &2nd year |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ASR | KGBV Ananthagiri | 28130607808 | MPC | 36 | 36 | 0 | 100.00 | V RIBIKHA | 883 | 100% |
| 2 | ASR | KGBV Dumbriguda | 28130404607 | MPC | 37 | 37 | 0 | 100.00 | M ANJALI KUMARI | 860 | |
| 3 | ASR | KGBV G.Madugula | 28131112202 | BIPC | 38 | 38 | 0 | 100.00 | SRIDEVI | 929 | 100% |
| 4 | ASR | KGBV Hukumpeta | 28130307404 | BIPC | 40 | 40 | 0 | 100.00 | P SINDHU | 911 | 100% |
| 5 | ASR | KGBV Munchingiput | 28130115706 | MPC | 31 | 31 | 0 | 100.00 | CH ANUSHA | 904 | 100% |
| 6 | ASR | KGBV Paderu | 28130202713 | MPHW | 40 | 40 | 0 | 100.00 | U AKHILA | 938 | |
| 7 | ASR | KGBV Chinthapalli | 28131210107 | MEC | 40 | 39 | 1 | 97.50 | K JHANSI | 835 | |
| 8 | ASR | KGBV Pedabayalu | 28130202713 | BIPC | 40 | 39 | 1 | 97.50 | S HANSIKA PRIYA | 938 | |
| 9 | ASR | KGBV Koyyuru | 28131404007 | MPC | 38 | 37 | 1 | 97.37 | K KEERTHANA ALIKHYA | 854 | |
| 10 | ASR | KGBV Arakuvalley | 28130590512 | MPC | 37 | 36 | 1 | 97.30 | V LEKHA | 892 | |
| 11 | ASR | KGBV GK Veedhi | 28131306709 | MPC | 37 | 36 | 1 | 97.30 | S SINDHU TULANI | 871 | |
| | ASR_TOTAL | | | | 414 | 409 | 5 | 98.79 | | | |

Samagra Shiksha, Andhra Pradesh
KGBV INTERMEDIATE 1ST YEAR RESULT 2026
ALLURI SITHARAMA RAJU DISTRICT

| SNO | NAME OF THE DISTRICT | NAME OF THE KGBV | UDISE CODE | GROUP | INTER 1st YEAR: NO OF STUDENTS APPEARED | NO OF STUDENTS PASSED | NO OF STUDENTS FAILED | PASS % | NAME OF THE STUDENT SCORED HIGHET MARKS | HIGHEST MARKS SECURED |
|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | ASR | KGBV Ananthagiri | 28130607808 | MPC | 41 | 41 | 0 | 100.00 | M RAMULAMMA | 442 |
| 2 | ASR | KGBV G.Madugula | 28131112202 | BIPC | 38 | 38 | 0 | 100.00 | S RENUKA | 440 |
| 3 | ASR | KGBV Hukumpeta | 28130307404 | BIPC | 40 | 40 | 0 | 100.00 | J DIVYA SRI | 431 |
| 4 | ASR | KGBV Munchingiput | 28130115706 | MPC | 36 | 36 | 0 | 100.00 | M MADHAVI | 460 |
| 5 | ASR | KGBV Paderu | 28130202713 | MPHW | 40 | 38 | 2 | 95.00 | K CHANDINI | 478 |
| 6 | ASR | KGBV GK Veedhi | 28131306709 | MPC | 38 | 36 | 2 | 94.74 | K SUBHALAKSHMI | 446 |
| 7 | ASR | KGBV Koyyuru | 28131404007 | MPC | 38 | 36 | 2 | 94.74 | P DALI PADMAJA | 419 |
| 8 | ASR | KGBV Chinthapalli | 28131210107 | MEC | 39 | 36 | 3 | 92.31 | K GEETHA | 446 |
| 9 | ASR | KGBV Pedabayalu | 28130202713 | BIPC | 39 | 36 | 3 | 92.31 | G DHANALAKSHMI | 439 |
| 10 | ASR | KGBV Arakuvalley | 28130590512 | MPC | 29 | 26 | 3 | 89.66 | S REJESWARI | 422 |
| 11 | ASR | KGBV Dumbriguda | 28130404607 | MPC | 35 | 27 | 8 | 77.14 | M HARIKA | 400 |
| | ASR_TOTAL | | | | 413 | 390 | 23 | 94.43 | | |

**పాడేరు, పెన్ పవర్, ఏప్రిల్ 15:** అల్లూరి సీతారామరాజు జిల్లాలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాలు 2025-26 ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణత సాధించాయి. జిల్లాలోని అన్ని కళాశాలల కంటే కేజీబీవీలు మెరుగైన ఫలితాలు సాధించడం గర్వకారణమని సమగ్ర శిక్ష ఏపీసీ స్వామి నాయుడు తెలిపారు.

ఈ ఏడాది ఫలితాల్లో ప్రథమ సంవత్సరంలో 94.43 శాతం, ద్వితీయ సంవత్సరంలో 98.79 శాతం ఉత్తీర్ణత నమోదైంది. అనంతగిరి, దుంబ్రిగూడ, హుకుంపేట, ముంచింగిపుట్, పాడేరు, జి.మాడుగుల కేజీబీవీలు ప్రథమ సంవత్సరంలో నూటికి నూరు శాతం ఫలితాలు సాధించాయి.

అలాగే జి.మాడుగుల, హుకుంపేట, ముంచింగిపుట్ కేజీబీవీలు మొత్తంగా నూటికి నూరు శాతం ఉత్తీర్ణత నమోదు చేశాయి.

విద్యార్థినుల కృషి, ఉపాధ్యాయుల పట్టుదల, అధికారుల సహకారంతోనే ఈ ఘనత సాధ్యమైందని, భవిష్యత్తులోనూ ఈ ప్రమాణాలు కొనసాగించేందుకు కట్టుబడి ఉన్నామని స్వామి నాయుడు పేర్కొన్నారు.ఐ

## గూడెం కొత్తవీధి కేజీబీవీకి ఇంటర్ ఫలితాల్లో మెరుగైన ప్రతిభ





**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 15:**బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో గూడెం కొత్తవీధి కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం (కేజీబీవీ) విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ప్రథమ సంవత్సరం ఇంటర్మీడియట్‌లో 38 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 36 మంది ఉత్తీర్ణత సాధించి 95 శాతం ఫలితాన్ని నమోదు చేశారు. ద్వితీయ సంవత్సరం ఇంటర్‌లో 37 మంది పరీక్షలు రాయగా 36 మంది ఉత్తీర్ణత సాధించి 97 శాతం ఉత్తీర్ణత నమోదు చేసినట్లు కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ నాగలక్ష్మి తెలిపారు.ద్వితీయ సంవత్సరంలో సాగిన సింధుతులాని 871 మార్కులతో పాఠశాల టాపర్‌గా నిలిచింది. ప్రథమ సంవత్సరంలో కె. సుబ్బలక్ష్మి 446 మార్కులతో టాప్ సాధించింది. అలాగే సాగిన సింధుతులాని గత ఏడాది ప్రథమ సంవత్సరం ఫలితాల్లో కూడా టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, బోధన మరియు బోధనేతర సిబ్బంది అభినందించారు.

# లిపేదల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత అండ



రాష్ట్ర వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు

**26 మందికి చెక్కులు పంపిణీ చేసిన**

**టెక్కలి , పెన్ పవర్ ఏప్రిల్ 15 :** పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్య భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. శ్రీకాకుళం జిల్లా కోటబొమ్మాళి ఎన్టీఆర్ భవన్ వద్ద బుధవారం 26 మంది లబ్ధిదారులకు 23 లక్షలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టెక్కలి నియోజకవర్గంలో 22 నెలల్లో 304 మంది లబ్ధిదారులకు 3 కోట్ల ఒక లక్ష రూపాయలు ప్రయోజనం చేకూరింది అన్నారు. వివిధ రకాల వ్యాధులతో బాధపడుతూ వైద్యం కోసం భారీ ఖర్చులు చేసి ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉదారంగా ఆర్థిక సహాయం అందిస్తున్నారని మంత్రి తెలిపారు. ఎన్డీఏ ప్రభుత్వంలో ఎవ్వరూ వైద్యం కోసం ఇబ్బందులు పడకూడదనే లక్ష్యంతో రాష్ట్ర వ్యాప్తంగా 175 నియోజకవర్గాల్లో కోట్లాది రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా అందిస్తున్నామని చెప్పారు. పేదల ఆరోగ్య భద్రత కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని, ఆపద సమయంలో అప్పులు చేసి వైద్యం చేయించుకున్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ కొండంత అండగా నిలుస్తోందని, ప్రైవేటు ఆసుపత్రుల్లో లక్షల రూపాయలు ఖర్చు చేసిన లబ్ధిదారులను ఆదుకునేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు మంత్రి అచ్చెన్నాయుడికి కృతజ్ఞతలు తెలిపారు.

**లబ్ధిదారుల వివరాలు:**

కోటబొమ్మాళి మండలం లో మడసు వేణు -- 34,581; మాట్టా చిన్నమ్ముడు -- 30,000; కోట వీరమ్మ -- 27,166; చల్లా తేజావతి -- 20,000; చల్లా పాపయ్య -- 39,879; పట్టా జగ్గారావు -- 65,918; వాన భాస్కరరావు -- 1,17,604; తంగుడు చంద్రశేఖరరావు -- 35,800; ఇప్పిలి షణ్ముఖ సాయి -- 8,00,000.

నందిగాంలో వేహన్ కృష్ణ -- 76,780; బమ్మిడి వైకుంటరావు -- 2,00,626; రాయపూడి శ్రీను -- 2,50,000.

లిసంతబొమ్మాళిలో సుగ్గు నారాయణరెడ్డి -- 30,000; వడల సరస్వతి -- 20,000; చింతల తిరుపతిరావు -- 30,500; పుటి ఈశ్వరమ్మ -- 47,384; సిరిగిడి పెరిపిల్ల -- 14,101; తుంబాల నాగేశ్వరరావు -- 28,500; చెక్క దానమ్మ -- 41,129

టెక్కలి ఢ ఇతర ప్రాంతాలు:

సుంకర గురువులు -- 37,205; పగోటి చిన్నప్పన్న -- 33,795; సోమలపూరి కామమ్మ -- 25,000; మెట్ట మురళీ కృష్ణ -- 53,185; సావర రామారావు -- 1,67,853; పడాల సత్యవతి -- 22,101; కొండల జగన్నాధం -- 74,606 అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, తెలుగు దేశం పార్టీ ముఖ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అన్నార్తుల ఆకలి తీర్చేందుకు అన్నా క్యాంటీన్ లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చన్న నాయుడు



**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 15 :** పేదలు, పట్టణానికి ఉపాధి వచ్చిన కూలీలు, కార్మికులు, అన్నార్తుల ఆకలి తీర్చేందుకు రూ.5 రూపాయలకే కడుపునిండా భోజనం పెట్టేందుకు అన్నా క్యాంటీన్ లను ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి పట్టణంలోని ఇందిరా గాంధీ కూడలి వద్ద ఏర్పాటు చేసిన నూతన అన్నా క్యాంటీన్ భవనాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు రాష్ట్రంలోని మున్సిపల్, కార్పొరేషన్ లలో 207 అన్నా క్యాంటీన్ లు నిర్వహిస్తుండగా, నేటి నుంచి గ్రామీణ ప్రాంతాలకు విస్తరించి కొత్తగా 67 అన్నా క్యాంటీన్ లను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ప్రత్యేకంగా టెక్కలి నియోజకవర్గం లో రెండు అన్నా క్యాంటీన్ లు నిర్వహించడం అంతులేని ఆనందాన్నిచ్చిందని సంతృప్తిని వ్యక్తం చేశారు. రోజువారీ కూలీ పనులకు వెళ్లే వారికి, వృద్ధులకు అన్నా క్యాంటీన్ లు కొండంత అండగా నిలుస్తున్నాయని అన్నారు. ఆహారం నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా పరిశుభ్రమైన వాతావరణంలో భోజనాన్ని వడ్డించేలా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామన్నారు. అన్నా క్యాంటీన్ సేవలను గ్రామీణ ప్రాంతాలకు విస్తరిస్తామనే హామీని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆచరణ పెడుతున్నారని చెప్పారు. పట్టణంలోని ప్రధాన కూడలి ప్రాంతాలు ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జిల్లా కేంద్రానికి దీటుగా టెక్కలి నియోజక వర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నదే తన ఆశయమని వెల్లడించారు. అనంతరం అన్నా క్యాంటీన్ కు వచ్చిన పేదలకు భోజనాన్ని జిల్లా కలెక్టర్, మంత్రి స్వయంగా వడ్డించారు. పేదల తో పాటు కలసి భోజనం చేసి ఆహార నాణ్యత, రుచిని పరిశీలించారు. బోజన వంటకాల రుచి, నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, కోటబొమ్మాళి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బగాది శేషగిరిరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, ప్రజారోగ్య శాఖ కార్యనిర్వాహణాధికారి వంశీ కృష్ణా, ఎమ్.కృష్ణ మూర్తి, డి ఎల్ డిఓ అలివేలు మంగ , ఎమ్ పీ డీ వో రేణుక, తాసిల్దార్ సత్యం, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి ఎమ్.సుధాకర్, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారి కె.రామ కృష్ణ, తదితరులు, పాల్గొన్నారు

## శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాటు.




**చింతపల్లి పెన్ పవర్ ఏప్రిల్ 15.** మండల కేంద్రంలో అత్యంత వైభవంగా నిర్వహిస్తున్న శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ అమ్మవారి జాతర సందర్భంగా వైద్య వైద్య శిబిరాన్ని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మెడికల్ సిబ్బంది మాట్లాడుతూ ముత్యాలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ప్రమాదాలు జరిగిన వెనువెంటనే ప్రథమ చికిత్స చేసే విధంగా ఉండడానికి గాను జిల్లా అధికారుల ఆదేశాల ప్రకారం వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పండుగ సమయంలో ఎవరికి ప్రమాదవశాత్తు వడదెబ్బ తగిలిన, ప్రమాదాలు సంభవించిన ప్రాథమిక కేంద్రాలైన ఆర్ వి నగర్, లంబసింగి, జెరెల, కోరుకొండ, తాజంగి తదితర పి హెచ్ సి ల నుండి సిబ్బంది ని వైద్య శిబిరం కొరకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి జగదీష్, ఎంపీహెచ్ఈఓ కన్నబాబు, హెల్త్ అసిస్టెంట్ వీర్రాజు, పీహెచ్సీ సిబ్బంది సుమర్ల అప్పారావు, వెంకటరమణ పాల్గొన్నారు.

## జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోండి

* కోటబొమ్మాళి జూనియర్ సివిల్ జడ్జి ఎం. రోషిణి





**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 15 :** కోటబొమ్మాళి కోర్టులో మే 9న ఉదయం 10:30 గంటలకు జరిగే జాతీయ లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి ఎం. రోషిని కోరారు. కోటబొమ్మాలి కోర్టులో బుధవారం జాతీయ లోక్ అదాలత్

పై న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది బ్యాంకు సిబ్బందితో బుధవారం వేరువేరుగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజీకి అనుకూలమైన కేసులు పరిష్కరించుకోవాలని, రాజీయే రాజమార్గం అని అన్నారు. రాజీకి అనుకూలమైన అన్ని క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రీ లిటిగేషన్ కేసులు ఇరు పార్టీల అంగీకారం తో పరిష్కరించుకోవాలని, లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని ఆమె తెలిపారు.

లోక్ అదాలత్ లో సివిల్ కేసులు పరిష్కారమైతే కోర్టు ఫీజు కూడా వాపసు ఇస్తామని ఆమె తెలిపారు. ఈ సమావేశాల్లో కోటబొమ్మాళి న్యాయవాదులు, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, నౌపాడ , జలుమూరు మండలాల పోలీసులు, ఎక్సైజ్ అధికారులు ,బ్యాంకు న్యాయ సలహా న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

## కైలాసగిరి త్రిశూల్‌కు తుది మెరుగులు

నెలాఖరులో ప్రారంభానికి సిద్ధం





**విశాఖ దక్షిణం పెన్ పవర్, ఏప్రిల్ 15. :**ప్రముఖ పర్యాటక కేంద్రం కైలాసగిరిలో నిర్మాణం లో ఉన్న త్రిశూల్ ప్రాజెక్టును అత్యంత ఆకర్షణీ యంగా తీర్చిదిద్దుతూ, ఈ నెలాఖరులోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విశాఖపట్నం మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్ మెంట్ అథారిటీ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ తెలిపారు.బుధవారం ఉదయం కైలాసగిరి వద్ద త్రిశూల్ నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలిం చిన ఆయన, పనుల పురోగతిపై సంతృప్తి వ్య క్తం చేశారు. ప్రాజెక్టును వేగవంతం చేసి సమ యానికి పూర్తి చేయాలని సంబంధిత అధికారు లను ఆదేశించారు.త్రిశూల్ పరిసరాలను మరిం త అందంగా తీర్చిదిద్దేందుకు పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. సందర్శకులకు మెరుగైన అనుభవం కల్పించేందుకు బెంచీలు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. అలాగే శివలింగ ఆకారంలో ప్రత్యేక వర్టికల్ గార్డెనింగ్ ఏర్పాటు చేసి ఆధ్యాత్మిక వాతావరణాన్ని ప్రతిబింబించేలా అభివృద్ధి చేయాలని ఆదేశించారు.భద్రతా పరంగా ఎలాం టి లోపాలు లేకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, మొత్తం ప్రాంతాన్ని సురక్షితంగా మార్చాలని స్పష్టం చేశారు.వేసవి సెలవులు ప్రారంభం కావడంతో కైలాసగిరికి వచ్చే పర్యా టకుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్న నేపథ్యం లో, ఘాట్ రోడ్డులో ట్రాఫిక్ సౌలభ్యం కోసం అదనపు సిబ్బందిని నియమించాలని సూచిం చారు. ఘాట్ రోడ్ చివరి మలుపు నుంచి తెలు గు మ్యూజియం వరకు నిర్మించిన రహదారిని త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు.

ఈ పరిశీలన కార్యక్రమంలో కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, కార్యనిర్వహక ఇంజనీర్లు భవానీ శంకర్, మధు, డీఎఫ్ఓ శిరీష తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా ఎం.వి. ప్రణవ్ గోపాల్ నియామకం



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 15 :**తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యద ర్శిగా వీఎంఆర్‌డీఏ చైర్మన్ నియమితులయ్యా రు. పార్టీకి దీర్ఘకాలంగా సేవలందిస్తున్న ఆయన కు ఈ పదవి దక్కడం పట్ల పార్టీ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.విద్యార్థి దశ నుంచే రాజకీయా ల్లో చురుకుగా పాల్గొన్న ప్రణవ్ గోపాల్, టీడీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసి విద్యార్థుల సమస్యలపై పోరాటం చేశారు. ఈ క్రమంలో పార్టీ బలోపేతానికి కీలక పాత్ర పో షించారు. అనంతరం కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన తర్వాత ఆయనను వీఎంఆ ర్‌డీఏ చైర్మన్‌గా నియమించారు.ప్రస్తుతం రాష్ట్ర కమిటీలో చోటు కల్పిస్తూ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడం పట్ల ప లువురు నాయకులు అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా ప్రణవ్ గోపాల్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగిం చిన ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షు డు , జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు రా ష్ట్ర ఐటీ శాఖ మంత్రి , రాష్ట్ర అధ్యక్షుడు మరి యు గాజువాక ఎమ్మెల్యే , విశాఖ ఎంపీ ,తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే , జిల్లా అధ్యక్షుడు సహా జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.

# చందనోత్సవానికి కట్టుదిట్టమైన ఏర్పాట్లు

- 2 లక్షల భక్తుల రద్దీకి సిద్ధం
- జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, ఏప్రిల్ 15 :**సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామివా రి వార్షిక చందనోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో, అంకితభావంతో పని చేయా లని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించా రు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన తుది సమీక్షలో ఆయన వివిధ శాఖల ఏర్పాట్లను పరిశీలించి కీలక మార్గదర్శ కాలు జారీ చేశారు.ఉత్సవ ప్రాంతాన్ని మొత్తం 12 సెక్టార్లుగా విభజించి, ప్రతి సెక్టార్‌కు దేవస్థా నం, రెవెన్యూ, పోలీస్ శాఖల నుంచి సీనియర్ అధికారులను ఇన్‌ఛార్జ్‌లుగా నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. వారు క్షేత్రస్థాయిలో అందుబా టులో ఉండి పరిస్థితులకు అనుగుణంగా తక్షణ నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సెక్టార్ అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పేర్కొన్నారు.భక్తుల భారీ రద్దీని దృష్టిలో ఉంచుకుని క్యూలైన్‌ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. కొండ దిగువన ఏర్పాటు చేసిన పార్కింగ్ కేంద్రాల్లో ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేసి, అవసరమైతే హోల్డింగ్ ఏరియాలను వినియోగించాలన్నారు. ఆర్టీసీ బస్సుల రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పరిష్కరించాలని సూచించారు.జీవీఎంసీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా వంటి ప్రాథమిక సౌకర్యాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. చందనోత్సవం రోజున సుమారు 2 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశమున్నందున ప్రతి భక్తుడు ప్రశాంతంగా దర్శనం పొందేలా అన్ని శాఖలు సమన్వయం తో పనిచేయాలని తెలిపారు.టికెట్ల విషయంలో క్యూఆర్ కోడ్ స్కానింగ్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, నకిలీ టికెట్లపై కఠిన చర్య లు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తులు టికెట్లను బ్యాంకులు లేదా ఆన్లైన్ ద్వారానే కొనుగోలు చేయాలని సూచించారు.


**ఒక పాస్‌కు ఒకే వాహనం ప్రైవేటు వాహనాలకు నో**

పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ మాట్లాడు తూ, ఒక పాస్‌పై ఒక వాహనానికే అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. వి.ఐ.పి.ల జాబితాను ముందుగానే సిద్ధం చేసి వారికి నిబంధ నలను తెలియజేయాలని సూచించారు. ఒక వి.ఐ.పితో పాటు గరిష్టంగా ఆరుగురు సభ్యుల కు మాత్రమే అనుమతి ఉంటుందని, దీనికి మించి అనుమతించబోమన్నారు.ప్రైవేటు వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతిం చబోమని, అదనపు రద్దీ నియంత్రణ కోసం దేవదాయ శాఖ ప్రత్యేక వాహనాలను వినియో గించుకోవాలని తెలిపారు. ఎలాంటి అవాంఛనీ య సంఘటనలు జరగకుండా ముందస్తు చర్య లు తీసుకుంటామని, అన్ని శాఖలు సమన్వ యంతో పని చేయాలని పేర్కొన్నారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు మేరీ ప్రశాంతి, మణికంఠ, డీఆర్వో ఎం. విశ్వేశ్వర నాయుడు, దేవస్థానం ఈవో జె. వెంకటరావు, ఆర్డీవోలు సంగీత్ మాధు ర్, శేషశైలజ తదితర అధికారులు పాల్గొన్నారు.

## దుడుమ డామ్ సమీపాన బస్ షెల్టర్ ప్రారంభం





- జెడ్పినిధులు 8 లక్షలతో సంగడ వద్ద బస్ షెల్టర్ నిర్మాణం.
- ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర.

**ముంచంగిపుట్టు, పెన్ పవర్, ఏప్రిల్ 15.**అల్లూరి జిల్లా, ముంచంగిపుట్టు మండలం, ఆంధ్రా ఒడిస్సా సరిహద్దు ప్రాంతంలో గల వనుగుమ్మ పంచాయితీకి చెందిన సంగడ గ్రామము వద్ద జిల్లా పరిషత్ నిధులతో నిర్మించిన బస్ షెల్టర్ ను ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్పర్సన్ జల్లిపల్లి సుభద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె మాట్లాడుతూ.. ప్రాంత ప్రజలు, ప్రయాణికుల కోరిక మేరకు జిల్లా పరిషత్ నిధులు 8 లక్షలతో బస్ షెల్టర్ నిర్మాణం చేపట్టామన్నారు. ప్రధాన రహదారిగా ఉన్నా ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు ప్రాంతమైన దుడుమ డామ్ సమీపంలో ఎటువంటి షెల్టర్ లేకపోవడంతో స్థానికంగా ఉన్న ప్రజా ప్రతినిధులు, పవర్ ప్రాజెక్ట్ ఉద్యోగులు బస్సు షెల్టర్ నిర్మాణానికి తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఈ నేపథ్యంలోనే సంగడ గ్రామ సమీపాన బస్ షెల్టర్ నిర్మించి ప్రారంభించమన్నారు. జగన్ ప్రభుత్వ హయంలో గిరిజన ప్రాంతంలో అభివృద్ధి పరుగులు పెట్టిందన్నారు. సరిహద్దు ప్రాంత ప్రజలు షెల్టర్ ను సద్వినియోగం చేసుకోవాలని ఆమె అన్నారు. తదనంతరం వైస్ ఎంపీపీ భాగ్యవతి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చి ఇన్నాళ్లైన ఈ సరిహద్దు ప్రాంతంలో బస్ షెల్టర్ లేదని, ఈ నేపథ్యంలోనే దుడ్డుమా డామ్ సమీపాన బస్ షెల్టర్ నిర్మాణం కొరకు జడ్పీ చైర్ పర్సన్ దృష్టికి తీసుకువెళ్లగా ఆమె సానుకూలంగా స్పందించి బస్సు షెల్టర్ నిర్మాణం చేపట్టారని అన్నారు. పలువురు మాట్లాడుతూ.. చైర్పర్సన్ సేవలను కొనియాడారు. బస్సు షెల్టర్ నిర్మాణానికి కృషి చేసిన జడ్పీ చైర్ పర్సన్ కు ఆ ప్రాంత వాసుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి ముందు జడ్పీ చైర్ పర్సన్ దంపతులకు స్థానిక ప్రజాప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు మూర్తి, పద్మారావు, జగబంధు, దేవా, నీలకంఠం, నరసింగరావు, అర్జున్, పిత్ బాష్, సాధురం, సంగడ సరిహద్దు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## నౌపడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఉత్తీర్ణత శాతం 81.42

కాలేజీ టాపర్ గా నిలిచిన ఎన్.కుసుమాంజలి







**టెక్కలి, పెన్ పవర్ ఏప్రిల్ 15 :** సంతబొమ్మాలి మండలం నౌపడ ప్రభుత్వ జూనియర్ కాలేజీ కి సంబంధించి బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో 81.42 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపాల్ సిరిపురం భీమేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 226 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 184 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ఆయన తెలిపారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో 69% ఉత్తీర్ణత, ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో 93% ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన వివరించారు.

పెద్ద మర్రిపాడు కి చెందిన ఎన్. కుసుమాంజలి సెకండ్ ఎంపీసీలో 978/1000 సాధించి కళాశాల టాపర్ గా నిలిచింది. సీతానగరం గ్రామానికి చెందిన బి.దీపిక ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ బైపిసి లో 959/1000 మార్కులు సాధించి కాలేజీ సెకండ్ టాపర్ గా నిలిచింది. అలాగే గొదలాం గ్రామానికి చెందిన పిలక మనోజ్ కుమార్ ఇంటర్ ఫస్ట్ ఇయర్ లో 465/470 మార్కులు సాధించాడు. దండుగోపాల పురం గ్రామానికి చెందిన కచ్చి కుసుమ ప్రియ ఇచ్ఛాపురం కస్తూరిబా స్కూల్లో ఇంటర్ ఫస్ట్ ఇయర్ సిఇసి లో 494/500 సాధించింది.

## డైవర్షన్ రాజకీయాలపై చిన్న శ్రీను ధ్వజమెత్తు..




**భోగాపురం భూస్కాం ఆరోపణలతో సంచలనం**

**బిమిలి, పెన్ పవర్, ఏప్రిల్ 15. :**రాష్ట్ర రాజకీయాల్లో అసలు ప్రజా సమస్యలను పక్కనబెట్టి దృష్టి మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు చిన్న శ్రీను తీవ్రంగా విమర్శించారు. విజయన గరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పత్రికా సమావేశంలో మాట్లాడిన ఆయన, ఇటీవలి రాజకీయ పరి ణామాలపై ఘాటుగా స్పందించారు.ప్రస్తుత ప్రభుత్వ ప్రతినిధులు ముఖ్యమైన అంశాలపై చర్చ జరగకుండా ఉద్దేశపూర్వకంగా పాత విషయాలను లేవనెత్తుతున్నారని చిన్న శ్రీను ఆరోపించారు. ముఖ్యంగా “మావిగాన్” వంటి కీలక అంశాన్ని పక్కదారి పట్టించేందుకే అనవస ర చర్చలు తెరపైకి తీసుకువస్తున్నారని విమ ర్శించారు.మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి మరణాన్ని రాజకీయ ప్రయో జనాల కోసం మళ్లీ ప్రస్తావించడం బాధాకరమని ఆయన అన్నారు. ప్రజలకు ఉపయోగపడే అం శాలపై దృష్టి సారించకుండా భావోద్వేగాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు ప్రజాస్వామ్యానికి హానిక రమని అభిప్రాయపడ్డారు.టీడీపీ నాయకులు పాత వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఫోటో ప్రదర్శనలు ఏర్పాటు చేయడం ప్రజలను తప్పుదారి పట్టించే చర్యలేనని ఆయన పేర్కొన్నారు. దశాబ్దాల క్రితం జరిగిన సంఘటనలను మళ్లీ లేవనెత్తడం ద్వారా ప్రజల్లో గందరగోళం సృష్టించాలని చూస్తున్నారని విమర్శించారు.గతంలో పలు వురు నాయకులు ఒకరిపై ఒకరు చేసిన వ్యాఖ్య లను ప్రజలు మరిచిపోలేదని గుర్తుచేసిన చిన్న శ్రీను, ఒక్కపక్ష విమర్శలు చేయడం తగదని సూచించారు. రాజకీయాల్లో సమతౌల్యం, బా ధ్యత అవసరమని చెప్పారు.ఇదిలా ఉండగా, భోగాపురం ఎయిర్‌పోర్ట్ పేరుతో పరిసర ప్రాం తాల్లో భూసంబంధిత అక్రమాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. వివిధ ప్రాజెక్టుల పేరుతో రైతులపై ఒత్తిడి తీసుకొచ్చి వారి భూములను స్వాధీనం చేసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని గుర్తుచేశారు. ప్రస్తుత పాలనలో ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులు కంటే ప్రచార కార్యక్రమాలకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని విమర్శించిన ఆయన, ప్రజా సమస్యలను విస్మరించడం సరికాదని హెచ్చరించారు. తప్పుడు ప్రచారాల ను ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు తగిన సమాధానం ఇస్తారని అన్నారు.

ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర, జిల్లా స్థాయి నేతలు, వివిధ విభాగాల బాధ్యులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మొండెంఖల్లు లో విద్యుత్ కష్టాలు



**గుమ్మలక్ష్మీపురం ఏప్రిల్ 15 పెన్ పవర్.**కురుపాం మండలం మొండెంఖల్లు గ్రామంలో గత మూడు రోజులుగా అరకొర విద్యుత్ తో మొండెంఖల్లు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.ఈ మేరకు గ్రామస్తులు బుధవారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ,మా గ్రామంలో కుటుంబాలు ఎక్కువ ఉండడంతో విద్యుత్ వినియోగం ఎక్కువగా ఉంటుంది దాని వలన విద్యుత్ లోవోల్టేజ్ తో అంతంత మాత్రంగా వస్తుంది అంతేకాక గత మూడు రోజులుగా పూర్తిగా విద్యుత సరఫరా నిలిచిపోయిందని దాని ప్రభావంతో త్రాగునీరు నిత్యవసరానికి కూడా చాలా ఇబ్బందికరంగా మారిందని కావున అదనంగా ట్రాన్స్ఫారం కావాలని గ్రామస్తులు కోరుతూ ఆవేదన వ్యక్తం చేశారు.ఈ మేరకు సోమవారం నాడు మన్యం జిల్లా కలెక్టర్ కు విద్యుత్ కోతలపై అదనం ట్రాన్స్ఫారం కొరకు వినతి పత్రం ద్వారా ఫిర్యాదు చేయడం జరిగిందని.జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి సానుకూలంగా స్పందించి సమస్య పరిష్కరిస్తానన్నారని.గ్రామస్తులు తెలిపారు.

# రోడ్డు భద్రత, శాంతిభద్రతలపై ఎస్పీ తుహిన్ సిన్హా కీలక ఆదేశాలు






**అనకాపల్లి, పెన్ పవర్, ఏప్రిల్ 15 :** జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) తుహిన్ సిన్హా అధికారులకు సూచించారు. అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో ఆయన కీలక దిశానిర్దేశం చేశారు.

జిల్లాలో పెండింగ్ కేసుల పరిష్కారం వేగవంతం చేయాలని, సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ముఖ్యంగా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపడం, సీట్ బెల్ట్ ధరించకపోవడం, రాంగ్ రూట్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ చలానాలు చెల్లించని వాహనాలను సీజ్ చేసి, అవసరమైతే లైసెన్సుల రద్దుకు రవాణా శాఖకు సిఫార్సు చేయాలని చెప్పారు.


నేషనల్ హైవే, ఆర్ అండ్ బి, జివిఎంసి, రవాణా శాఖల సమన్వయంతో ప్రమాదకర ప్రాంతాల్లో సాండ్ డ్రమ్స్, రంబుల్ స్ట్రిప్స్, స్పీడ్ బ్రేకర్లు, రేడియం స్టిక్కర్లు, తగిన లైటింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సెజ్ ప్రాంతాలు మరియు బ్రాండిక్స్ బస్సు డ్రైవర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని, ప్రమాదాల ఫోటోల ద్వారా ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు.

రౌడీ షీటర్లకు వారానికి ఒకసారి కౌన్సిలింగ్ నిర్వహించి, రూ. 1 లక్ష బైండోవర్ చేయాలని, శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే పీడీ యాక్ట్ నమోదు చేయాలని తెలిపారు. ఎన్‌డీపీఎస్ కేసుల్లో పునరావృత నేరస్థులపై పిట్ ఎన్‌డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, మహిళలపై నేరాలపై ప్రజల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని చెప్పారు.

దర్యాప్తులో ఫేస్ రికగ్నిషన్, సిసిటిఎన్ఎస్ ఈ-సాక్ష్య, యాప్ 360 వంటి సాంకేతిక సాధనాలను వినియోగించి కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని సూచించారు. తప్పిపోయిన పిల్లలు, చోరీకి గురైన వాహనాల గుర్తింపులో టెక్నాలజీ వినియోగాన్ని పెంచాలని అన్నారు. పారిశ్రామిక ప్రాంతాల్లో ఎస్ఓపిలను కచ్చితంగా అమలు చేయాలని, ప్రమాదాల సమయంలో వెంటనే స్పందించేలా సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. స్టేషన్లలో ఉన్న బాణాసంచా, పేలుడు పదార్థాలను కోర్టు అనుమతితో ఫైర్ అధికారుల సమక్షంలో నాశనం చేయాలని సూచించారు.

స్మార్ట్ పోలీసింగ్‌లో భాగంగా సిసిటిఎన్ఎస్లో డేటా అప్లోడ్‌లో ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎల్. మోహనరావు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు తదితర అధికారులు పాల్గొన్నారు.




## సింహాచలం చందనోత్సవం టిక్కెట్ల విక్రయం సాఫీగా ప్రారంభం

* సాంకేతిక సమస్యలు పరిష్కారం భక్తులకు ఈఓ భరోసా







**సింహాచలం, పెన్ పవర్, ఏప్రిల్ 15 :** ప్రముఖ ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రం శ్రీ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం సింహాచలంలో జరిగే వార్షిక చందనోత్సవానికి సంబంధించి టిక్కెట్ల విక్రయం ప్రస్తుతం ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా కొనసాగుతోందని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈఓ) తెలిపారు. గత మూడు రోజులుగా ఆన్‌లైన్ టిక్కెట్ల బుకింగ్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలు భక్తులకు ఇబ్బందులు కలిగించాయి. అయితే ఐటీ నిపుణుల సహకారంతో ఆ సమస్యలను పూర్తిగా పరిష్కరించినట్లు ఈఓ స్పష్టం చేశారు. నేటి నుంచి భక్తులు ఆలయ అధికారిక వెబ్‌సైట్ ద్వారా సులభంగా టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చని వెల్లడించారు. ఆన్‌లైన్ వ్యవస్థలో సర్వర్ సమస్యలు అధిగమించడంతో, నిర్ణీత కోటా ప్రకారం టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

ఇక ఆఫ్‌లైన్ విధానంలో కూడా టిక్కెట్ల పంపిణీ సక్రమంగా కొనసాగుతోంది. ముఖ్యంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరియు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖల ద్వారా టిక్కెట్ల విక్రయాన్ని మరింత క్రమబద్ధీకరించినట్లు తెలిపారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అవసరమైన ఏర్పాట్లు చేయాలని బ్యాంకు అధికారులకు ఇప్పటికే సూచనలు ఇచ్చినట్లు ఆయన చెప్పారు. టిక్కెట్ల కేటాయింపులో పూర్తిస్థాయి పారదర్శకత పాటిస్తున్నామని, భక్తులు ఈ మార్పులను గమనించి సహకరించాలని కోరారు. చందనోత్సవ దర్శనం సమయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, భక్తులు ప్రశాంతంగా స్వామివారి దర్శనం పొందేలా చర్యలు తీసుకుంటున్నామని ఈఓ తెలిపారు. టిక్కెట్ల కోసం అధికారిక మార్గాలను మాత్రమే ఉపయోగించాలి. దళారులను నమ్మవద్దని ఆలయ అధికారులు హెచ్చరించారు.

## ఏకలవ్య పాఠశాలలో సీబీఎస్ఈ 10వ ఫలితాలు.. శతశాతం ఉత్తీర్ణత




**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, ఏప్రిల్ 15:**జీకే వీధి ఏకలవ్య పాఠశాలలో సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో శతశాతం ఉత్తీర్ణత సాధించారు. ఈ సంవత్సరం పరీక్షలకు హాజరైన 59 మంది విద్యార్థులందరూ ఉత్తీర్ణులైనట్లు పాఠశాల ప్రిన్సిపల్ రమణరావు తెలిపారు. 600 మార్కులకు గాను 548 మార్కులు సాధించిన ఎం. దారా శ్రీ పాఠశాల టాపర్‌గా నిలిచారు. 542 మార్కులతో జి. బాలు ద్వితీయ స్థానం సాధించారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరికీ ప్రిన్సిపల్ అభినందనలు తెలిపారు.

## విశాఖ పశ్చిమలో మెగా జాబ్ మేళా పోస్టర్ విడుదల

యువతకు మరో భారీ అవకాశం




**విశాఖ పశ్చిమ, పెన్ పవర్, ఏప్రిల్ 15 :** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలను కల్పించే దిశగా విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో మరో మెగా జాబ్ మేళాకు సన్నాహాలు పూర్తి అయ్యాయి. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గణబాబు ఆధ్వర్యంలో ఏప్రిల్ 24న నిర్వహించనున్న ఈ జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణబాబు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు ప్రతి మూడు నెలలకు ఒకసారి నియోజకవర్గ స్థాయిలో జాబ్ మేళాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో నిర్వహించిన మూడు మేళాల్లో సుమారు 1,600 మంది యువతకు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు లభించాయని గుర్తు చేశారు.

రాబోయే జాబ్ మేళా ఏప్రిల్ 24న గోపాలపట్నం జెడ్పీ హైస్కూల్‌లో జరుగనుంది. ఈ కార్యక్రమంలో 50కి పైగా ప్రముఖ కంపెనీలు పాల్గొననున్నట్లు వెల్లడించారు. పదో తరగతి నుండి పీజీ, బీటెక్ వరకు చదివిన అభ్యర్థులు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. పోస్టర్‌పై ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా ముందస్తుగా నమోదు చేసుకోవాలని కోరారు.

"మన విశాఖ నగరం ఐటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డేటా సెంటర్లు, స్టీల్ ప్లాంట్ వంటి భారీ పరిశ్రమలకు కేంద్రంగా ఎదుగుతోంది. యువత ఇతర ప్రాంతాలకు వెళ్లకుండా ఇక్కడే స్థిరపడేలా ఈ జాబ్ మేళాలు దోహదపడతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ప్రతినిధులు చాముండేశ్వర్ రావు, రమేష్, జోనల్ కమిషనర్ హేమావతి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడికి జైలు శిక్ష

4 ఏళ్ల 9 నెలల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా విధించిన కోర్టు




**నర్సీపట్నం, పెన్ పవర్, ఏప్రిల్ 15 :** స్థానిక అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన గంజాయి అక్రమ రవాణా కేసులో కోర్టు కీలక తీర్పు వెలువరించింది. 2021లో నమోదైన ఈ కేసులో నిందితుడికి 4 సంవత్సరాలు 9 నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ. 5వేలు జరిమానా విధిస్తూ విశాఖపట్నం 1వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు తీర్పు ప్రకటించింది.

జరిమానా చెల్లించకపోతే అదనపు శిక్ష

కోర్టు ఆదేశాల ప్రకారం నిందితుడు జరిమానా చెల్లించని పక్షంలో మరో ఒక నెల సాధారణ జైలు శిక్షను అనుభవించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. ఈ కేసులో శిక్ష పడిన నిందితుడు ఆకాష్ పాండురంగన్ (ఏ-3) (19 సంవత్సరాలు), తండ్రి పాండురంగన్, తమిళనాడు రాష్ట్రంలోని వేలూరు జిల్లా బనవరం పరిధిలోని నరికుప్పం గ్రామానికి చెందినవాడు. 2021 జూలై 21 ఉదయం, నర్సీపట్నం రూరల్ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు నగరం గ్రామ శివారులో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు వ్యక్తులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని, వారి వద్ద ఉన్న లగేజీ బ్యాగులను తనిఖీ చేయగా సుమారు 10 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. విచారణలో నిందితులు గంజాయిని ఏజెన్సీ ప్రాంతం నుండి కొనుగోలు చేసి తమిళనాడుకు తరలిస్తున్నట్లు అంగీకరించారు. పోలీసుల దర్యాప్తు, కోర్టు తీర్పు అప్పటి ఎస్సై ఎస్. రమేష్ సమగ్రంగా దర్యాప్తు చేసి పక్కా సాక్ష్యాలతో కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. విచారణలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖజానా రావు ప్రాసిక్యూషన్ తరఫున బలమైన వాదనలు వినిపించారు.

సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు నేరం చేసినట్లు నిర్ధారించి శిక్ష విధించారు. ఈ తీర్పుపై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా స్పందిస్తూ, ఇది అనకాపల్లి జిల్లా పోలీసుల సమర్థవంతమైన పనితీరుకు నిదర్శనమని తెలిపారు. కేసును విజయవంతంగా దర్యాప్తు చేసిన ఎస్సై, ప్రాసిక్యూటర్, నర్సీపట్నం రూరల్ పోలీస్ సిబ్బంది మరియు కోర్టు మానిటరింగ్ సెల్ సభ్యులను ఆయన అభినందించారు.

## నేడు జీకేవిధి లో గ్రామసభ నిర్వహణ



**గూడెంకొత్తవీధి,పెన్ పవర్, ఏప్రిల్ 15:**ఈనెల 16న జీకే వీధి పంచాయతీ కేంద్రంలో గ్రామసభ నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి పండ్ర పాల్ తెలిపారు. మంగళవారం ఆయన అందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. అంబేద్కర్ జయంతి సందర్భంగా పంచాయతీల్లో గ్రామసభల నిర్వహణ చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అయితే పంచాయతీ ప్రజల నిర్ణయం మేరకు ఈనెల 16న గురువారం ఈ గ్రామసభను నిర్వహించేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన గిరిజనులు సమస్యలను గ్రామసభలో తెలియజేయాలన్నారు. ఆ సమస్యలను తీర్మానం చేసి వీలైనంత త్వరగా పరిష్కారం చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ గ్రామ సభను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ ధర్నాకు పిలుపు



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,ఏప్రిల్ 15:**నూతన ప్రభుత్వం ఏర్పడి సుమారు రెండేళ్లు గడిచినా ఉపాధ్యాయుల సమస్యలు ఇప్పటికీ అపరిష్కృతంగానే ఉన్నాయని జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్షుడు యు.వి. గిరి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయుల ప్రధాన సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 21న జిల్లా కేంద్రాల్లో, 25న విజయవాడలో పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ అమలు, సీపీఎస్ రద్దు, పీఆర్సీ అమలు, గిరిజన సంక్షేమ శాఖతో పాటు కేజీబీవీలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా గూడెం కొత్తవీధిలోని స్థానిక విద్యాసంస్థల్లో ఉపాధ్యాయులను కలిసి ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దొండ కాలేశ్వరరావు, మండల పీఆర్‌టీయూ అధ్యక్షుడు కె. వసంత్ నాయకత్వం వహించారు.

## మహిళల భద్రతపై జీ ఎం ఎస్ కే లతో ఎస్పీ సమీక్ష

మహిళా భద్రత అవగాహన ర్యాలీ నిర్వహణ







**పాడేరు, పెన్ పవర్, ఏప్రిల్ 15:** అల్లూరి జిల్లా పోలీసు పర్యవేక్షకులు అమిత్ బర్దర్ ఆధ్వర్యంలో పాడేరులో మంగళవారం గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.

జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, మహిళల భద్రత, సామాజిక అవగాహన పెంపొందించడమే ఈ సమావేశం ప్రధాన లక్ష్యమని ఎస్పీ తెలిపారు.

మహిళలపై నేరాల నివారణకు గ్రామ స్థాయిలో అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, వేధింపులు లేదా గృహ హింస వంటి సంఘటనలు జరిగిన వెంటనే స్పందించాలని ఆదేశించారు. బాల్య వివాహాల నివారణకు కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గృహ హింస, వరకట్న వేధింపులపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నామని, చిన్నారులకు మంచి స్పర్శ చెడు స్పర్శపై అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

నాటుసారా వంటి చెడు అలవాట్ల వల్ల కలిగే నష్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. మహిళలపై నేరాలు కొంతవరకు తగ్గుముఖం పట్టాయని, ఇలాంటి కార్యక్రమాలతో మరింత తగ్గిస్తామన్నారు. మహిళలు భయం లేకుండా పోలీసులకు సమస్యలు తెలియజేయాలని, నేరాలపై వెంటనే స్పందించి కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రహదారి ప్రమాదాల నివారణకు గ్రామీణ ప్రాంతాల్లో శిరస్త్రాణం ధరించడం, మితిమీరిన వేగాన్ని నివారించడంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అంతర్జాల మోసాలు, ఒక్కసారి వాడే సంకేత సంఖ్య పంచుకోవడం, గుర్తుతెలియని అనుసంధానాలపై అప్రమత్తంగా ఉండేలా గ్రామ స్థాయిలో చైతన్యం తేవాలని సూచించారు.

గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు పోలీసులకు ప్రజలకు మధ్య వారధిలా పనిచేయాలని, నేర రహిత వాతావరణం నెలకొల్పడంలో వారి పాత్ర కీలకమని ఎస్పీ అమిత్ బర్దర్ పేర్కొన్నారు.

అనంతరం ఎస్పీ ఆదేశాల మేరకు హుకుంపేట పరి వేక్షకులు సన్యాసినాయుడు ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లాలోని అన్ని మండలాల జీఎంఎస్‌కేలు ఇందులో పాల్గొన్నారు. మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడమే లక్ష్యమని, మహిళా పోలీసులు గ్రామాలను సందర్శిస్తూ ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని పరి వేక్షకులు తెలిపారు.

జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద లేదా అసాంఘిక కార్యకలాపాలు గమనిస్తే వెంటనే స్థానిక పోలీసులకు లేదా 112కు సమాచారం అందించాలని కోరారు.

## భారత జట్టు నుంచి రోహిత్, కోహ్లీ ఔట్..
# శత్రువులని కొని తెచ్చుకున్న గంభీర్..




**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ గురించి మాజీ పేసర్ మునాఫ్ పటేల్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. గంభీర్‌ను కోచ్ పదవి నుంచి తొలగించవద్దని భారత క్రికెట్ నియంత్రణ మండలి ( ని హెచ్చరించాడు. అది ఏమాత్రం ఇండియన్ టీమ్ కి మంచిది కాదని పేర్కొన్నారు. ఎందుకంటే, రోహిత్ శర్మ- విరాట్ కోహ్లీ లాంటి స్టార్ ఆటగాళ్లకు మొహమాటం లేకుండా 'నో' చెప్పే ధైర్యం ఒక్క గంభీర్‌కే ఉందని మునాఫ్ పటేల్ అభిప్రాయపడ్డారు. గంభీర్ ఉన్నది ఉన్నట్లు మాట్లాడే వ్యక్తి, జట్టు ప్రయోజనాల కోసం కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి ఆయన వెనుకాడరని మునాఫ్ పటేల్ వెల్లడించారు. జట్టులో క్రమశిక్షణను కాపాడటంలో గంభీర్ పాత్ర కీలకం, అతడ్ని తొలగిస్తే టీమ్ మేనేజ్‌మెంట్ కష్టమవుతుందని తెలిపారు. గౌతమ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్ అద్భుతమైన విజయాలు సాధించిందని చెప్పుకొచ్చాడు. గంభీర్ సారథ్యంలో భారత్ ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్, టీ20 ప్రపంచ కప్ వంటి మూడు ప్రధాన టోర్నీలను కైవసం చేసుకుంది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అద్భుతంగా రాణించినప్పటికీ, టెస్ట్ క్రికెట్‌లో జట్టు ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేకపోతున్నాయి పేర్కొన్నాడు. ప్రస్తుతం మునాఫ్ పటేల్ ఐపీఎల్ 2026 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా సేవలు అందిస్తున్నారు. ఇప్పటివరకు ఆడిన 4 మ్యాచ్‌ల్లో 2 విజయాలతో, 4 పాయింట్లతో పాయింట్ల పట్టికలో 5వ స్థానంలో ఢిల్లీ కొనసాగుతోంది. ఒకవైపు గంభీర్ కోచింగ్ శైలిపై చర్చ జరుగుతుంటే, మరోవైపు మునాఫ్ పటేల్ లాంటి మాజీ ఆటగాళ్లు అతడికి అండగా నిలవడం ఆసక్తికరంగా మారింది.

# రోహిత్ శర్మ గాయంపై బిగ్ అప్‌డేట్.. ముంబై ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ



**హైదరాబాద్ పెన్ పవర్:** ముంబై ఇండియన్స్ జట్టు ఫ్యాన్స్ కి గుడ్ న్యూస్. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచులో టార్గెట్ ఛేదనలో ముంబై ఓపెనర్ రోహిత్ శర్మ గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్ గా మైదానం వీడాడు. దీంతో 241 రన్స్ ఛేదనలో ముంబై కేవలం 222 పరుగులకే పరిమితమైంది. అప్పటికి రోహిత్ 13 బంతుల్లో 19 రన్స్ చేశాడు. ఈ క్రమంలో రోహిత్ గాయంపై సర్వత్రా టెన్షన్ నెలకొంది. కానీ, అతడికి సంబంధించి మెడికల్ రిపోర్ట్ వచ్చింది. కండరాలు పట్టేయడంతో స్టేడియం వీడిన అతడు.. స్కానింగ్ తీయించుకున్నాడు. మెడికల్ రిపోర్ట్ ప్రకారం ఎలాంటి చీలిక లేదని తేలిపోయింది. దీంతో ముంబై ఇండియన్స్ అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. పంజాబ్ కింగ్స్ జట్టుతో గురువారం (026, ఏప్రిల్ 16న) మ్యాచ్లో ఆడతాడో? లేదో అనేది ఇంకా గందరగోళంగానే ఉంది. గాయం మరీ పెద్దది కాకపోవడంతో ఫస్ట్ అనుకున్నట్లు మరిన్ని మ్యాచులకు మాత్రం దూరమయ్యే ఛాన్స్ లేదు. ఇవాళ సాయంత్రానికి రోహిత్ శర్మ ఫిట్ నెస్ పై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం అద్భుతమైన ఫామ్ లో ఉన్న రోహిత్ సేవలు జట్టుకి ఎంతో అవసరం. కనీసం అతడిని ఇంపాక్ట్ ప్లేయర్ గానైనా బరిలోకి దింపే అవకాశం ఉంటుందని ఐపీఎల్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఐపీఎల్లో ఒక ఫ్రాంచైజీ తరపున 6వేల రన్స్ చేసిన బ్యాటర్ గా హిట్ మ్యాన్ నిలిచాడు. ఈ సీజన్లో ముంబై నాలుగు మ్యాచుల్లో ఒకేఒక్క విజయం సాధించింది. ప్లేఆఫ్స్ కి చేరుకోవాలంటే ఇక నుంచి ప్రతి మ్యాచ్ గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు బ్యాటింగ్ లో ఫర్వాలేదనిపిస్తోన్న ఎంఐ.. బౌలింగ్ మాత్రం తేలిపోతోంది. స్టార్ పేసర్లు బుమ్రా, బౌల్ట్ ప్రభావం చూపింలేక, ఘోరంగా విఫలమవుతున్నారు.

# లక్నో ఐం ఆర్సీబీ మధ్య హై వోల్టేజ్ ఫైట్.. విన్నర్ మాత్రం ఆ జట్టే!



**హైదరాబాద్ పెన్ పవర్:** మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ లక్నో సూపర్ జయంట్స్ జట్లు కాసేపట్లో (2026, ఏప్రిల్ 15న) పోటీ పడబోతున్నాయి. గత మ్యాచ్‌లో ముంబైపై సాధించిన విజయంతో ఆర్‌సీబీ పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉండగా, లక్నో గత మ్యాచ్‌లో గుజరాత్ చేతిలో ఓటమిని ఎదుర్కొని ఈ మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. కాగా ఈరోజు జరిగే మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ అత్యధిక పరుగులు చేసే అవకాశం కనిపిస్తుంది. తన సొంత గడ్డ (చిన్నస్వామి స్టేడియం)పై ఈ సీజన్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో కోహ్లీ ఇప్పటికే 97 పరుగులు సాధించి మంచి ఫామ్‌లో ఉన్నాడు.

**విజేత ఎవరంటే?:**

ప్రస్తుత ఫామ్, హోమ్ గ్రౌండ్ అడ్వాంటేజ్‌ను బట్టి చూస్తే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) టీమ్ ఈ మ్యాచ్‌లో హాట్ ఫేవరెట్‌గా కనిపిస్తోంది. గూగుల్ స్పోర్ట్స్ డేటా ప్రకారం.. ఆర్‌సీబీ గెలిచే అవకాశం 62.3 శాతం ఉండగా, లక్నో సూపర్ జెయింట్స్ గెలిచే అవకాశం 37.7 శాతం మాత్రమే ఉందని తెలిపింది.

**పిచ్ రిపోర్ట్:**

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం ఎప్పుడూ బ్యాటర్లకు స్వర్గధామంగా ఉంటుంది. చిన్న బౌండరీలు, ఫ్లాట్ వికెట్ వల్ల ఇక్కడ పరుగుల వరద పారడం ఖాయం. ఆర్‌సీబీ గతంలో ఇక్కడ 250ం పరుగులు కూడా సాధించింది, కాబట్టి ఈరోజు కూడా భారీ స్కోర్లు నమోదు అయ్యే అవకాశం ఉంది.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: ఫిల్ సాల్ట్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్, టిమ్ డేవిడ్, జితేష్ శర్మ, రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, రసిక్ సలామ్, జోష్ హాజిల్‌వుడ్.

ఇంపాక్ట్ ప్లేయర్: సుయాష్ శర్మ

లక్నో సూపర్ జయంట్స్: ఐడెన్ మార్క్రామ్, మిచెల్ మార్ష్, రిషబ్ పంత్, ఆయుష్ బదోని, నికోలస్ పూరన్, అబ్దుల్ సమద్, ముకుల్ చౌదరి, జార్జ్ లిండే/అన్రిచ్ నోర్జే, మహమ్మద్ షమీ, అవేష్ ఖాన్, దిగ్వేష్ సింగ్ రాఠీ.

ఇంపాక్ట్ ప్లేయర్: ప్రిన్స్ యాదవ్

---

## కృతి శెట్టి బ్లాక్ స్ట్రాప్‌లెస్ గౌన్‌లో డ్రీమీ లుక్‌తో స్టన్ చేసింది



# టాప్- 10 హీరోయిన్ల చీర సొగసు



భారతీయ సంప్రదాయంలో చీరకు ఉన్న ప్రాధాన్యత గురించి తెలిసిందే. పండుగ ఏదైనా.. భామలు చీరకడితే ఆ కళే వేరు. 2026 -విషు- పండుగ సందర్భంగా భారతీయ చలనచిత్ర రంగంలోని అగ్ర కథానాయికలు తమ చీరకట్టుతో సౌందర్యాన్ని, మోడ్రన్ స్టైల్ ను మేళవించి సరికొత్త ట్రెండ్‌ను సెట్ చేస్తున్నారు. సంప్రదాయ నేత మొదలుకొని .. సింపుల్ ఆర్గంజా వస్త్రాల వరకు తారలు తమ ఫ్యాషన్ ఎంపికలతో పండుగ వాతావరణానికి మరింత శోభను చేకూర్చారు. మహానటి కీర్తి సురేష్ తన రాయల్ గోల్డ్ చీరలో అచ్చమైన తెలుగింటి ఆడపడుచులా మెరిసిపోతున్నారు. దీనికి స్టేట్‌మెంట్ టెంపుల్ జువెలరీని జోడించి పండుగ కళను ఉట్టిపడేలా చేశారు. అలాగే త్రిష కృష్ణన్ క్రీమ్ అండ్ గోల్డ్ సిల్క్ చీరలో క్లాసిక్ లుక్‌ను ప్రదర్శించగా.. రెడ్ కలర్ బ్లౌజ్ ఆ అందానికి మరింత మెరుగులు దిద్దింది. నేషనల్ క్రష్ రష్మిక మందన్న ఆఫ్-వైట్ సిల్క్ చీరలో... జుట్టులో మల్లెపూలతో దేవకన్యలా కనిపిస్తూ విషు పండుగ విశిష్టతను చాటిచెప్పారు.

మరోవైపు నయనతార బంగారు వర్ణం టిష్యూ సిల్క్ చీరలో రాచరికపు హుందాతనాన్ని ఒలకబోయగా... సమంత రూత్ ప్రభు పసుపు - ఆకుపచ్చ రంగుల మేళవింపుతో కూడిన చీరలో దేవకన్యను తలపిస్తున్నారు. పార్వతి ఎరుపు రంగు చీరపై గోల్డెన్ ఫోయిల్ వర్క్‌తో సంప్రదాయ మూలాలను ప్రతిబింబించగా.. అదితి రావు హైదరీ ఊదా రంగు చీర -భారీ ఆభరణాలతో పండుగ వైబ్ ని నింపారు. వీరందరి మేకోవర్స్ సంప్రదాయానికి పట్టాభిషేకం చేసినట్లుగా ఉన్నాయి. ప్రయోగాలకు వేదికగా నిలిచిన రుక్మిణి గ్రీన్-అండ్-పింక్ కాంట్రాస్ట్ చీరలో కట్ అవుట్ బ్లౌజ్‌తో విభిన్నంగా కనిపించగా... సాన్యా మల్హోత్రా బేబీ పింక్ ఆర్గంజా చీరను పర్పుల్ బ్రోకేడ్ బ్లౌజ్‌తో జతచేసి రొమాంటిక్ అండ్ ఫెస్టివ్ లుక్‌ను సృష్టించారు. జాన్వీ కపూర్ హెవీ ఎంబ్రాయిడరీ గోల్డ్ చీరతో తన గ్లామర్‌ను ప్రదర్శిస్తూ వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అలియా భట్ మాత్రం సింపుల్ బ్లూ ప్రింటెడ్ చీరతో -తక్కువలోనే ఎక్కువ అందం- అన్నట్లుగా ఆకట్టుకున్నారు.ఓవరాల్ గా అగ్ర కథానాయికలందరూ చీరకట్టులో మెరిసిపోతూ ఫ్యాషన్ ప్రియులకు గొప్ప ప్రేరణగా నిలిచారు. ఆధునిక కాలంలో వెస్ట్రన్ దుస్తులకు ఎంత ప్రాధాన్యత ఉన్నా.. పండుగ వేళ చీరకట్టు ఇచ్చే ఆత్మవిశ్వాసం, గౌరవం మరే ఇతర దుస్తుల్లోనూ ఉండదని ఈ భామల ఫోటోలు నిరూపిస్తున్నాయి. ఈ విషు వేడుకల్లో తారల -చీర సొగసు- సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారి పండుగ సంబరాలను రెట్టింపు చేసింది.

## మెరూన్ లెహంగా లుక్



Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At FLAT NO. 31, RAJEEV NAGAR, VISAKHA A COLONY, NEAR JAMATHOTA, KILLIPALEM PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. "PEN POWER" vide PRGI Registration No. "APTEL/25/A4918" Editor: GANTYADA APPARAO. e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965PANCHAYAT, PATHAPATNAM, SRIKAKULAM DIST. Editor GANTYADA APPARAO.e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965